విశాఖపట్టణం
మంగళవారం 21 జులై 2026
For a pure tomorrow..
జయ జయహే
epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక:178 వెల: రూ.5/- పేజీలు: 8
Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## ప్రైవేటీకరణ ఎంత మాత్రం కాదు

సబ్ రిజిస్ట్రార్ సేవలు సులభతరం చేస్తాం

పాస్ పోర్టు సేవా కేంద్రాల తరహాలు సేవలు

మధ్యవర్తుల ప్రమేయం తగ్గుతుంది

దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి

ప్రజలకు వాస్తవాలు వివరించాలి

సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు



2

# రణరంగం..!

పార్లమెంట్ ముట్టడికి కాక్ రోచ్ పార్టీ యత్నం

భారీగా సంఖ్యలో చేరుకుని హోరెత్తిన విద్యార్థులు

నినాదాలతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు

పోలీసుల లాఠీచార్జి, టియర్ గ్యాస్ ప్రయోగం

విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్





(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఢిల్లీ వీధులు విద్యార్థుల నినాదాలతో హోరెత్తాయి. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పటిష్టమైన పోలీసు బందోబస్తు, లాఠీఛార్జీలు, టియర్ గ్యాస్ ప్రయోగాలను సైతం లెక్కచేయకుండా విద్యార్థులు, నిరసనకారులు తమ పోరాటాన్ని కొనసాగించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. పార్లమెంట్ వీధి వైపు దూసుకుపోతున్న నిరసనకారులను పోలీసులు బహుళ అంచెల బారికేడ్లతో అడ్డుకున్నారు. రాజధాని నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. పోలీసులు ఎంతగా అణచివేసేందుకు ప్రయత్నించినా వెనకడుగు వేసేది లేదని విద్యార్థులు స్పష్టం చేశారు.

"మమ్మల్ని అనేక చోట్ల అడ్డుకోవడానికి ప్రయత్నించారు. మార్గమంతా భారీ బారికేడ్లు పెట్టారు. లాఠీఛార్జ్ చేశారు, టియర్ గ్యాస్ విసిరారు. అయినా సరే మేము వెనక్కి వెళ్లేది లేదు" అని నిరసనలో ..మిగతా 2లో



## తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉచిత రవాణా

కొత్తగా 500 వాహనాలు ఏర్పాటు

ఏటా 2.75 లక్షల తల్లులు లబ్ధి

సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడి

(అమరావతి - జయజయహే)

గర్భిణులు, ప్రసవం తర్వాత తల్లులు, నవజాత శిశువులకు ఉచిత రవాణా కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలో 500 కొత్త తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇది ప్రతి సంవత్సరం సుమారు 2.75 లక్షల మంది మహిళలకు ప్రయోజనం చేకూరుస్తుందని అంచనా. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్పోర్ట్ యుటిలిటీ వెహికల్స్ , మల్టీ యుటిలిటీ వెహికల్స్ సీఎం చంద్రబాబు పరిశీలించారు. వాటి డిజైన్, భద్రతా ఫీచర్లు, తల్లులు, శిశువుల కోసం సౌకర్యాలు, ఈ చొరవ కోసం అభివృద్ధి చేసిన బ్రాండింగ్ తదితరాలను సమీక్షించారు. గర్భిణులు, ప్రసవానంతర తల్లులు, నవజాత శిశువులకు ఉచిత రవాణా సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం 500 కొత్త తల్లీ-బిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలను విడుదల ..మిగతా 2లో

## అయోధ్య విరాళాలపై రాజకీయం చేయొద్దు

సరైన మార్గంలో దర్యాప్తు చేయిస్తాం

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

ఇక ఎస్బీఐ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



అయోధ్య రామమందిర విరాళాల కేసుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును రాజకీయం చేయవద్దని, కోర్టులు రాజకీయాలకు వేదిక కాదని పేర్కొంది. ఇది ఒక సాధారణ నేరమని, తాము సరైన మార్గంలో దర్యాప్తు జరిగేలా చూస్తామని తెలిపింది. ఈ కేసు దర్యాప్తునకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిందని, ప్రస్తుతం ఆ రాష్ట్ర పోలీసులు విచారణ చేస్తున్నారని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ వెల్లడించారు. కాగా, ఈ కేసుపై సిట్ దర్యాప్తు వివరాలను ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సమర్పించిన నేపథ్యంలో, సుప్రీంకోర్టు జులై 27కు విచారణను వాయిదా వేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనాలతో కూడిన ధర్మాసనం ఈ కేసుపై విచారణ చేసింది. ఈ సందర్భంగా, అయోధ్య రామమందిర విరాళాల చోరీపై విచారణకు సిట్ చేయవచ్చా? అని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. "మేము చిన్న హెచ్చరిక చేస్తున్నాం. దయచేసి ఈ అంశాన్ని రాజకీయం చేయకండి. కోర్టులు రాజకీయాలకు వేదికలు కాదు. ఇది కేవలం ఒక నేరానికి సంబంధించిన సాధారణ కేసు. సరైన దర్యాప్తు జరిగేలా చూడడమే మా పని" అని సీజేఐ సూర్యకాంత్ అన్నారు. అంతకుముందు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ..మిగతా 2లో

## మళ్లీ గ్యాస్ మంట..?

యుద్ధం మొదలుతో తీవ్ర ప్రభావం

పెంచే యోచనలో ఎల్పీజీ సంస్థలు

గ్యాస్ ధరలు పెరిగితే కేంద్రంపై ఆర్థిక ఒత్తిడి

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



త్వరలో సామాన్యులకు మరో షాక్ తగలనుందా..? ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల ధరలు మళ్లీ పెరగనున్నాయా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం మళ్లీ మొదలవ్వడం, హార్మూజ్ జలసంధి మూతపడటంతో ఎల్పీజీ గ్యాస్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశముంది. దీంతో గ్యాస్ ధరలు మళ్లీ పెరగవచ్చనే సంకేతాలు వినిపిస్తున్నాయి. యుద్ధం ముగిసిపోవడం, ఇటీవల గ్యాస్ సరఫరా పునరుద్ధరణ జరగడంతో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలను కేంద్రం తగ్గించింది. ఇప్పుడు మళ్లీ యుద్ధం మొదలుకావడంతో గ్యాస్ దిగుమతులకు ..మిగతా 2లో



## ట్రైనీ ఐపీఎస్ ఆత్మహత్యయత్నం

లైంగిక వేధింపుల ఆరోపణలతో ఘాతుకం

ప్రైవేటు వీడియోలు తీసి బెదిరించాడని లేడీ ట్రైనీ ఆరోపణ

దర్యాప్తు చేసి నిర్ధారించిన పోలీసు అధికారులు

స్టేషన్ లో కేసు నమోదుతో మనస్తాపం

(హైదరాబాద్ - జయజయహే)

రాజేంద్రనగర్‌లోని నేషనల్ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తోటి మహిళా అధికారిణిపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం చేయడం తీవ్ర కలకలం రేపింది. సోమవారం ఉదయం మోతీనగర్‌లోని తన బంధువుల ఇంట్లో ఆయన శానిటైజర్ తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఇది గమనించిన బంధువులు వెంటనే ఆయనను ఎస్ఆర్ నగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఆయన ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. తనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఆత్మహత్యాయత్నానికి ముందు ..మిగతా 2లో

## త్రిపుర డీజీపీ అనుమానస్పద మృతి

కార్యాలయంలోనే రక్తపు మడుగులో మృతదేహం

మృతికి తెలియరాని కారణాలు

పోస్టుమార్టం రిపోర్టు వచ్చాకనే స్పష్టత

పోలీసు శాఖలో తీవ్ర విషాదం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)



ఈశాన్య రాష్ట్రమైన త్రిపురలో అత్యున్నత పోలీస్ వ్యవస్థను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసే విషాదకర సంఘటన చోటుచేసుకుంది. త్రిపుర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ గా సేవలందిస్తున్న 1994 బ్యాచ్‌కి చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి అనురాగ్ ధంకర్ సోమవారం మధ్యాహ్నం అగర్తలాలోని రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో తన ఛాంబర్‌లోనే అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఆయన తన వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీనియర్ పోలీస్ అధికారులు భావిస్తున్నారు. ఈ ఘటన తెలిసిన వెంటనే భద్రతా బలగాలు, ఉన్నతాధికారులు హెడ్‌క్వార్టర్స్‌కు పరుగులు తీశారు. పోలీస్ కార్యాలయంలో రక్తసిక్తమైన స్థితిలో ఉన్న ధంకర్‌ను వెంటనే తీవ్ర గాయాలతో అగర్తలాలోని గోవింద్ వల్లభ్ పంత్ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆసుపత్రికి తీసుకువచ్చే సమయానికే ఆయనలో ప్రాణం లేదని వైద్యులు ధృవీకరించారు. మధ్యాహ్నం 12 గంటల ..మిగతా 2లో

## బాలలకు ఒకే రీతిలో హెయిల్ స్టైల్

విభిన్న హెయిల్ స్టైల్స్ పై ఆంక్షలు

ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు వర్తింపు

క్రమశిక్షణ, ఏకాగ్రత, సమానత్వ భావన

విద్యాశాఖ కొత్త మార్గదర్శకాలు

2



# రణరంగం..!

మొదటి పేజీ తరువాయి...

పాల్గొన్న ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థిని గ్లోరీ తెలిపారు.

**ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకే మొగ్గు**

వారాలుగా నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల విద్యార్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "విద్యార్థులను పట్టించుకోని దేశం గమ్యం లేనిదవుతుంది" అని ఒక విద్యార్థి ఆవేదన వ్యక్తం చేశారు.

"కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నదే మా ఏకైక డిమాండ్. నెరవేర్చలేని అసాధ్యమైన డిమాండ్లను మేము కోరడం లేదు. ఇంతవరకు వచ్చిన మేము, పోరాటం పూర్తయ్యేంత వరకు విశ్రమించం" అని డీయూ విద్యార్థిని సంస్కృతి కుమార్ స్పష్టం చేశారు. ఈ ఆందోళనకు మద్దతుగా 52 ఏళ్ల జామియా మిలియా ఇస్లామియా పూర్వ విద్యార్థిని కనీజ్ ఫాతిమా కూడా నిరసనలో పాల్గొన్నారు. గత మూడు వారాలుగా జంతర్ మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న ఉద్యమకారులకు ఆమె మద్దతు ఇస్తున్నారు. "ఇది మన దేశం కాదా? పౌరులుగా ప్రశ్నించే హక్కు, అంగీకారం లేని నిర్ణయాలను సవాలు చేసే హక్కు మనకు లేదా? హక్కుల



కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు ఎందుకు లాఠీఛార్జ్ చేస్తున్నారు?" అని ఫాతిమా ప్రశ్నించారు. ఇది తమకు 'సై లేదా నై' లాంటి ఘట్టమని, ఇప్పటివరకు ఎంతో మంది త్యాగాలు చేశారని, ఇప్పుడు వెనక్కి తగ్గితే మళ్లీ హక్కుల కోసం గళమెత్తలేమని పేర్కొన్నారు.

**ఇళ్లల్లో చెప్పకుండా వచ్చి..**

పోలీసుల తీరుపై పలువురు యువతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాదర్‌పూర్ ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల అన్షిక, స్కూలుకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి ఈ నిరసనలో పాల్గొంది. అయితే పోలీసులు తమ పట్ల నేరస్థుల్లా ప్రవర్తించారని వాపోయింది. చేతిపై ఉన్న గాయాలను చూపుతూ, మహిళా పోలీసులు తనను కిందకు లాగి గట్టిగా పట్టుకున్నారని ఆరోపించింది. "ఎన్నికలప్పుడు మా ఇళ్లకు వచ్చి ఓట్లు అడుగుతారు, కానీ నీట్ పేపర్ లీక్‌పై చర్చించడానికి మాత్రం ముఖం చాటేస్తారు. మేము కేవలం చర్చను మాత్రమే కోరుతున్నాం. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా మాకు లేదా?" అని అన్షిక ప్రశ్నించింది. ఇక బిహార్‌లోని వైశాలి జిల్లాకు చెందిన 20 ఏళ్ల కిస్మత్, నిరసన కోసం పాట్నా నుంచి రాత్రికే రాత్రి ప్రయాణమై ఢిల్లీకి చేరుకుంది. ఇంట్లో చెప్తే భద్రత గురించి భయపడతారని, అబద్ధం చెప్పి ఇక్కడికి వచ్చానని పేర్కొంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేసే వరకు తమ పోరాటం ఆగేది లేదని ఆందోళనకారులు స్పష్టం చేశారు.

## అయోధ్య విరాళాలపై రాజకీయం చేయొద్దు

మొదటి పేజీ తరువాయి...

మాట్లాడుతూ, కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్టేటస్ రిపోర్టు దాఖలు చేసిందని తెలిపారు. "దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటి వరకు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. నేను అంత కంటే ఎక్కువ వివరాలు వెల్లడించలేను" అని చెప్పారు. దీనితో కేసును సిట్ దర్యాప్తు చేస్తోందా అని కోర్టు ప్రశ్నించగా, "వాస్తవాలను తెలుసుకోవడానికి మాత్రమే సిట్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు దీనిని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో ఒక నేరం జరిగిందని మాత్రమే సిట్ కనిపెట్టింది" అని తుషార్ మెహతా పేర్కొన్నారు.

యూపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆ దర్యాప్తు బృందంలో ఇద్దరు సీనియర్ ఐఏఎస్ అధికారులు, లఖ్‌నవూ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీ) సభ్యులుగా ఉన్న విషయాన్ని ధర్మాసనం గమనించింది. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా దర్యాప్తు సాగేలా చూడడానికి వారే ఈ ప్రధాన దర్యాప్తును కూడా నిర్వహించవచ్చా? అని కోర్టు ప్రశ్నించింది. పిటిషనర్లలో ఒకరి తరఫున హాజరైన సీనియర్ అడ్వకేట్ దేవదత్ కామత్ తన వాదనలు వినిపిస్తూ, "రామాలయం నిర్మించినప్పుడు ప్రతి ఒక్కరి నుంచి విరాళాలు సేకరించారని మా పిల్‌లో పేర్కొన్నాం. ఇప్పుడు ఆ విరాళాల రశీదులను భద్రపరచాలని, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని మేము కోరుతున్నాము" అని అన్నారు. ఈ అభ్యర్థనను తాము పరిశీలిస్తామని, వచ్చే సోమవారం ఈ కేసును మళ్లీ విచారణకు స్వీకరించినప్పుడు తగిన ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం పేర్కొంది. జులై 13న ఈ వ్యవహారంలో స్టేటస్ రిపోర్టును సమర్పించాలని ఉత్తరప్రదేశ్ పోలీసులను ధర్మాసనం ఆదేశించింది. అలాగే విరాళాల దొంగతనం ఆరోపణలపై నిష్పక్షపాతంగా, నిర్ణీత కాలపరిమితిలో దర్యాప్తు జరపాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై 'శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు'కు కోర్టు నోటీసులు జారీ చేసింది. ముగ్గురు పిటిషనర్లలో ఒకరైన నరేంద్ర కుమార్ గోస్వామి, ఈ వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని కోరుతూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అంతేకాదు రామమందిర వ్యవహారాలను పర్యవేక్షించే ఈ ట్రస్టు ఆర్థిక లావాదేవీలపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) చేత ఆడిటింగ్ చేయించాలని కూడా ఆయన కోరారు. అజయ్ కుమార్ రాయ్, దినేశ్ కుమార్ యాదవ్ కూడా ఇలాంటి చర్యలనే కోరుతూ రెండో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తుతోపాటు, ఆర్‌జేడీ ఎంపీ సుధాకర్ సింగ్ దాఖలు చేసిన మూడో పిటిషన్‌లో ఆలయ ట్రస్ట్ పూర్తి ఆర్థిక వ్యవహారాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని కోరారు.

**ఎస్‌బీఐ పర్యవేక్షణలో విరాళాల లెక్కింపు**

మరోవైపు, అయోధ్య రామమందిర విరాళాల చోరీ వివాదం నేపథ్యంలో నగదు లెక్కింపునకు ఆలయ ట్రస్ట్ కొత్త బృందాన్ని రంగంలోకి దించింది. విరాళాల పెట్టెల్లోని నగదును, కానుకలను లెక్కించడానికి ఎస్‌బీఐ పర్యవేక్షణలో రెండు షిఫ్టుల విధానాన్ని ప్రవేశపెట్టినట్లు ఆలయ, బ్యాంక్ వర్గాలు తెలిపాయి. ఒకవారం రోజుల పాటు ట్రయల్స్ నిర్వహించిన తర్వాత ఆదివారం నుంచి ఆ ప్రక్రియ ప్రారంభమైంది. ఆలయ వర్గాల సమాచారం ప్రకారం, ప్రతి షిఫ్టులో 10 నుంచి 12 మందితో కూడిన బృందాన్ని ఏర్పాటు చేశారు. మొదటి షిఫ్టు ఉదయం 8 నుంచి 2 గంటల వరకు, రెండో షిఫ్టు మధ్యాహ్నం 2 నుంచి 8 గంటల వరకు కొనసాగుతుంది. విరాళాల దొంగతనం కేసులో మునుపటి ఇన్‌ఛార్జ్ సుభాష్ శ్రీవాస్తవ జైలుకు వెళ్లడంతో, ఆయన స్థానంలో నగదు లెక్కింపునకు కొత్త ఇన్‌ఛార్జ్‌గా శోభనాథ్ మిశ్రాను ట్రస్ట్ నియమించినట్లు సదరు వర్గాలు పేర్కొన్నాయి.

## త్రిపుర డీజీపీ అనుమానస్పద మృతి

మొదటి పేజీ తరువాయి...

సమయానికి ఆయనను అత్యవసర విభాగానికి తీసుకువచ్చారని, పల్స్, బీపీ ఏమీ లేకపోవడంతో సుమారు 40 నిమిషాల పాటు సీపీఆర్ ఇచ్చి కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయిందని, మధ్యాహ్నం 12:48 గంటలకు ఆయన మృతి చెందినట్లు అధికారికంగా ప్రకటించామని డాక్టర్ ప్రదీప్ భౌమిక్ వెల్లడించారు. పోస్ట్‌మార్టం నివేదిక వచ్చిన తర్వాతే మరణానికి గల ఖచ్చితమైన కారణాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

మచ్చలేని సుదీర్ఘ కెరీర్ ఉన్న ఒక అత్యున్నత స్థాయి అధికారి హెడ్‌క్వార్టర్స్‌లోనే తన ప్రాణాలు తీసుకునేంత తీవ్ర నిర్ణయం ఎందుకు తీసుకున్నారనేది ఇప్పుడు సమాధానం లేని ప్రశ్నగా మారింది. ఘటన స్థలాన్ని సీజ్ చేసిన పోలీసులు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు ప్రారంభించారు. ఆయన వ్యక్తిగత జీవితంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా, లేదా వృత్తిపరమైన ఒత్తిళ్లు ఏమైనా కారణమయ్యాయా అనే అంశాలపై ప్రత్యేక బృందాలు విచారణ జరుపుతున్నాయి. సీఎం మాణిక్ సాహా, ఇతర ప్రభుత్వ పెద్దలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆసుపత్రికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనురాగ్ ధంకర్ 1994 బ్యాచ్ త్రిపుర క్యాడర్ ఐపీఎస్ అధికారిగా దేశ రాజకీయ, దర్యాప్తు వర్గాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారు. మే 2025లో అమితాభ్ రంజన్ స్థానంలో త్రిపుర డీజీపీగా బాధ్యతలు స్వీకరించడానికి ముందు, ఆయన త్రిపురలోనే డీజీపీ ఇంటెలిజెన్స్) గా బాధ్యతలు నిర్వహించారు. అంతేకాకుండా తన కెరీర్‌లో కేంద్ర దర్యాప్తు సంస్థ లో సుదీర్ఘకాలం పనిచేస్తూ పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆర్థిక కుంభకోణంలో నీరవ్ మోదీ కేసుతో పాటు 1984 సిక్కు వ్యతిరేక అల్లర్ల దర్యాప్తుకు సంబంధించిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ కి కూడా నాయకత్వం వహించిన గొప్ప అనుభవం ఆయనకుంది.

## ట్రైనీ ఐపీఎస్ ఆత్మహత్యయత్నం

మొదటి పేజీ తరువాయి...

ఉదయ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేసినట్లు సమాచారం. రాజేంద్రనగర్‌లోని ప్రతిష్టాత్మక సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ పోలీస్ అకాడమీ లో శిక్షణ పొందుతున్న కర్ణాటకకు చెందిన మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి.. ఉదయ్ కృష్ణారెడ్డి తనను శారీరకంగా, లైంగికంగా వేధిస్తున్నాడంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు జూన్ 23 నుంచి తనకు అసభ్యకర మెసేజ్‌లు పంపాడని పేర్కొన్నారు. ఆపై జూలై 8న గదిలోకి లాకెళ్లి ఫోన్ పాస్‌వర్డ్ చెప్పాలని బెదిరించాడని.. జూలై 9న గదిలో బంధించి, జుట్టు పట్టుకుని దాడి చేసి,



మెడపై కత్తి పెట్టి బెదిరించాడని ఆరోపించారు. జూలై 10న తన ప్రైవేట్ వీడియోలు తీసి, వాటిని తన భర్తకు పంపిస్తానంటూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు శనివారం నాడు ఉదయ్ కృష్ణారెడ్డిపై భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్లు 74, 75, 77, 315(2)తో పాటు ఐటీ చట్టం కింద కఠినమైన కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడు గతంలోనూ సహచర ఐపీఎస్‌లతో అమర్యాదగా ప్రవర్తించేవాడని, వాట్సప్ గ్రూపుల ద్వారా కొందరిని వేధించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.


**ట్రైనీ ఐపీఎస్‌పై సస్పెన్షన్ వేటు వేసిన పోలీస్ అకాడమీ**

ఆరోపణలు ఎదుర్కొంటున్న ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణా రెడ్డిని నేషనల్ పోలీస్ అకాడమీ అధికారులు తాత్కాలికంగా సస్పెండ్ చేసి అకాడమీ నుండి పంపించివేశారు. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రంగంలోకి దిగిన ప్రివిలేజ్ కమిటీ.. సీసీటీవీ దృశ్యాలు, ఇతర కీలక ఆధారాలను సేకరించి విచారించిన అనంతరం ఆయనపై వచ్చిన ఆరోపణలు నిజమేనని నిర్ధారించి ఈ తక్షణ సస్పెన్షన్ నిర్ణయం తీసుకుంది. అయితే, భవిష్యత్తులో ఆయన సర్వీసులో చేరడానికి సంబంధించిన తుది నిర్ణయం మాత్రం కేంద్ర సిబ్బంది, శిక్షణా వ్యవహారాల శాఖ పరిధిలోనే ఉంటుందని ఎన్ పీ ఏ అధికారులు స్పష్టం చేశారు. ఏపీలోని ప్రకాశం జిల్లా ఊళ్లపాలెంకు చెందిన ఉదయ్ కృష్ణారెడ్డి జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచింది. తల్లిదండ్రులు లేకపోవడంతో నానమ్మ వద్ద పెరిగాడు. కూరగాయలు అమ్ముతూ ఆమెకు చేదోడువాదోడుగా ఉంటూ ప్రభుత్వ పాఠశాలలో చదివారు. ఈ క్రమంలో ఉమ్మడి ఏపీలో చివరి నోటిఫికేషన్ 2013లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. కొన్నేళ్లపాటు కానిస్టేబుల్ గా సేవలు అందించారు. ఈ క్రమంలో ఉన్నత అధికారి చేసిన అవమానంతో ఉద్యోగానికి రాజీనామా చేసి సివిల్స్ ప్రిపరేషన్ మీద ఫోకస్ చేశారు. నాలుగు పర్యాయాలు ఫెయిల్ అయినా కుంగిపోలేదు. కచ్చితంగా విజయం సాధిస్తానని నమ్మిన ఆయన ఐదో ప్రయత్నంలో 360వ ర్యాంకుతో సివిల్స్ సాధించారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపీఎస్ అధికారిగా ఎదిగి తెలుగు రాష్ట్రాల వారితో పాటు దేశంలోని చాలా మంది యువతగా ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం శివరాంపల్లిలోని నేషనల్ పోలీస్ అకాడమీలో ట్రైనీ ఐపీఎస్‌గా శిక్షణ పొందుతున్నారు. త్వరలో బాధ్యతలు స్వీకరించాల్సి ఉన్న ఈ సమయంలో పోలీస్ అకడమీలో తోటి ట్రైనీ మహిళా ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉచిత రవాణా

మొదటి పేజీ తరువాయి...

చేయనుంది. ప్రభుత్వ సంక్షేమను హైలైట్ చేస్తూ సేవ గురించి ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో బ్రాండింగ్ డిజైన్లను చంద్రబాబు ఆమోదించారు. బ్రాండింగ్, వాహన స్టిక్కరింగ్ పూర్తయిన తర్వాత ప్రత్యేకంగా నియమించిన 500 ఎస్యూవీలు, ఎంయూవీ వాహనాలను రాష్ట్రవ్యాప్తంగా మోహరించనున్నారు. ప్రసవానంతర తల్లులు, నవజాత శిశువులు, ఒక సహాయకుడికి ప్రభుత్వ ఆసుపత్రుల నుండి వారి ఇళ్లకు ఉచిత రవాణాను ఈ వాహనాలు అందిస్తాయి. గర్భిణులు, తీవ్రమైన రక్తహీనత ఉన్నవారిని వైద్య పరీక్షల కోసం ఆసుపత్రులకు తరలించడానికి ఈ వాహనాలను ఉపయోగిస్తారు. వాహనాలలో వెనుక సీటు బెల్టులు, ప్రసవానంతర తల్లులు సులభంగా ఎక్కడానికి సహాయపడే ఫుట్ రెస్ట్, ఎయిర్ కండిషనింగ్, ప్రథమ చికిత్స కిట్, ఫైర్ సేఫ్టీ పరికరాలు, రియల్ టైమ్ మానిటరింగ్ కోసం జీపీఎస్ ట్రాకింగ్ సిస్టమ్‌లు ఉన్నాయి. ఈ కార్యక్రమ అమలు, విమానాల నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా సేవలను విస్తరించే ప్రణాళికలపై అధికారులు ముఖ్యమంత్రి వివరించారు. 'గర్భిణీ స్త్రీలు, ప్రసవానంతర తల్లులు, నవజాత శిశువులకు ఉచిత రవాణా సేవలను అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం త్వరలో 500 కొత్త తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రవేశపెట్టనుంది. దీని ద్వారా ఏటా సుమారు 2.75 లక్షల మంది తల్లులు లబ్ధి పొందుతారు.' అని చంద్రబాబు నాయుడు తెలిపారు.



## ప్రైవేటీకరణ ఎంత మాత్రం కాదు

(అమరావతి - జయజయహే)

ర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖలపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏర్పాటు చేయబోతున్న రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల అంశం ప్రస్తావనకు వచ్చింది. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తోంటే... కొందరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను ప్రైవేటీకరణ చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రం- ఆర్ ఎస్ కే లను ఏర్పాటు చేస్తున్నామని... ఇది ప్రైవేటీకరణ ఎంత మాత్రమూ కాదని చెప్పారు. పాస్ పోర్టు సేవా కేంద్రాల తరహాలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు పని చేస్తాయని సీఎం వెల్లడించారు. పాస్ పోర్టు సేవా కేంద్రాల ఏర్పాటుతో పాస్ పోర్టు ప్రాసెసింగ్ సులభతరమైందన్నారు. ఇదే తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ సేవలను సులభంగా పొందవచ్చని అన్నారు. ఆర్ఎస్‌కే ద్వారా సేవలు సులభతరంగా పొందడంతో పాటు.. మధ్యవర్తుల ప్రమేయం తగ్గుతుందని చెప్పుకొచ్చారు. ప్రజలకు సేవలందించేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తోంటే... కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలకు వాస్తవాలు వివరించే బాధ్యతను అధికారులు తీసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను వివరించాలన్నారు. డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. వారి ఉపాధికి ఇబ్బంది లేని విధంగా ఆదాయ మార్గాలు చూపెడతామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## బాలలకు ఒకే రీతిలో హెయిల్ స్టైల్

(అమరావతి - జయజయహే)

సినిమాలు, సోషల్ మీడియా, క్రీడాకారుల ప్రభావంతో విభిన్న హెయిర్ స్టైల్స్‌ను అనుసరించే విద్యార్థులకు ఇకపై బ్రేక్ పడనుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివే బాలురందరూ ఒకే తరహా హెయిర్ కట్‌తో పాఠశాలకు రావాలని రాష్ట్ర విద్యాశాఖ కొత్త మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. పాఠశాలల్లో కొందరు విద్యార్థులు సినీ హీరోలు, క్రికెటర్లను అనుకరిస్తూ విభిన్న హెయిర్ స్టైల్స్‌తో వస్తుండటంతో చదువుకంటే రూపురేఖలపై ఎక్కువ దృష్టి పెడుతున్నట్లు విద్యాశాఖ గుర్తించింది. విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమానత్వ భావన పెంపొందించడంతో పాటు చదువుపై ఏకాగ్రత పెంచాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇలాంటి హెయిర్ స్టైల్స్ పాఠశాల వాతావరణాన్ని ప్రభావితం చేయడమే కాకుండా, తోటి విద్యార్థుల దృష్టిని కూడా మరల్చే అవకాశం ఉందని విద్యాశాఖ పేర్కొంది. ఈ 'ఏకరీతి హెయిర్ స్టైల్ విధానం' ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటికీ వర్తిస్తుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల విద్యార్థుల మధ్య అనవసర పోటీ, రూపురేఖలపై ఆసక్తి తగ్గి, చదువు, క్రమశిక్షణ, పాఠశాల సంస్కృతిపై మరింత దృష్టి పెరిగే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

**ఈ హెయిర్ స్టైల్స్‌కు నిషేధం**

స్పైకీ, ముల్లెట్ , ఫేడ్ ప్యాటర్న్స్ , ఎక్స్‌ట్రీమ్ ఫేడ్, హెయిర్ కలరింగ్

## మళ్లీ గ్యాస్ మంట..?

మొదటి పేజీ తరువాయి...

అంతరాయం ఏర్పడే అవకాశముంది. అదే జరిగే గ్యాస్ సిలిండర్ల ధరలు మళ్లీ పెరగవచ్చని చెబుతున్నారు. ఇక గ్యాస్ సబ్సిడీల భారం 2026-27 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి ఒక పెద్ద సవాలుగా మారవచ్చని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం ఎల్పీజీ సబ్సిడీ బిల్లు రూ.1 లక్ష కోట్లకు పైగా ఉంటుందని అంచనా. కేంద్ర బడ్జెట్‌లో సబ్సిడీ కోసం కేవలం రూ.30,000 కోట్లు మాత్రమే కేటాయించారు. అంటే బడ్జెట్ అంచనా కంటే ప్రభుత్వం సుమారుగా రూ.7 వేల కోట్లు అదనంగా కేటాయించాల్సి రావచ్చు. అంతర్జాతీయ ఎల్పీజీ ధరలలో హెచ్చుతగ్గులు, దేశీయ వినియోగదారులకు ఉపశమనం కలిగించేందుకు సిలిండర్ ధరలను నియంత్రించే ప్రభుత్వ విధానం కారణంగా సబ్సిడీ భారం క్రమంగా పెరుగుతోంది. ఇక ప్రధానమంత్రి ఉజ్వల యోజన లబ్ధిదారులపై దని ప్రభావాన్ని తగ్గించాలని కేంద్రం భావిస్తోంది. దీంతో ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు వాటిల్లిన నష్టాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించాల్సి రావచ్చు. సబ్సిడీలు బడ్జెట్‌లో కేటాయించిన మొత్తాన్ని మించిపోతే.. ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం , హిందుస్థాన్ పెట్రోలియం వంటి ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు మొదట్లో ప్రభావితం కావచ్చు. అయితే ప్రభుత్వం తర్వాత అదనపు బడ్జెట్ మద్దతు లేదా ఇతర ఆర్థిక ఏర్పాట్ల ద్వారా ఈ కంపెనీలకు ఉపశమనం కల్పించవచ్చు. అంతర్జాతీయ ఎల్పీజీ ధరలు అధికంగానే కొనసాగితే.. ప్రభుత్వంపై ఆర్థిక ఒత్తిడి మరింత పెరగవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన కింద లక్షలాది పేద కుటుంబాలకు రాయితీ ధరలకు ఎల్పీజీ సిలిండర్లను అందిస్తున్నారు. ఈ పథకం పరిధి విస్తరించడం, లబ్ధిదారుల సంఖ్య పెరగడం వల్ల ప్రభుత్వ రాయితీ వ్యయం కూడా పెరుగుతోంది. వినియోగదారులపై అదనపు భారం మోపకుండ రాయితీల ద్వారా ఉపశమనం కల్పించే వ్యూహాన్ని ప్రభుత్వం ప్రస్తుతం అనుసరిస్తోంది.

# హజ్-2027 యాత్ర దరఖాస్తుకు గడువు పెంపు

### విజయవాడ ఎంబార్కేషన్‌కు మొదటి ప్రాధాన్యత ఇవ్వండి

### మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విజ్ఞప్తి

**అమరావతి,జులై 20 (జయ జయహే )**

పవిత్ర మక్కా యాత్ర హజ్ -2027 కు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 24వ తేదీ వరకు కేంద్ర హజ్ కమిటీ గడువు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసినట్లు మైనారిటీ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. కేంద్ర హజ్ కమిటీ పెంచిన నాలుగు రోజుల గడువును హాజీలు సద్వినియోగం చేసుకోవాలని సోమవారం అమరావతిలో విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి ఫరూక్ కోరారు.హజ్ -2027 కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 20 వ తేదీ వరకు కేంద్ర హజ్ కమిటీ గడువును నిర్ణయించిన విషయం తెలిసిందేనని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఆన్ లైన్ దరఖాస్తుల ను పంపేందుకు గడువును మరో నాలుగు రోజులు పెంచుతూ కేంద్ర హజ్ కమిటీ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు దరఖాస్తులు సమర్పించని వారు కేంద్ర హజ్ కమిటీ పెంచిన గడువు వెసులుబాటును సద్వినియోగం చేసుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. గడువుకు ముందుగానే ఆన్ లైన్ ద్వారా హాజీ లు తమ పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని, ఆ తరువాత గడువు పొడిగించబడదని మంత్రి ఫరూక్ సూచించారు.లి



విజయవాడ ఎంబార్కేషన్ న్ కు మొదటి ప్రాధాన్యత ఇవ్వండి

హజ్ -2027 యాత్రకు వెళ్లే ఆంధ్రప్రదేశ్ కు చెందిన హాజీలు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం కు మొదటి ప్రాధాన్యత ఇచ్చి దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ మంత్రి ఫరూక్ యాత్రికులకు విజ్ఞప్తి చేశారు. గన్నవరం విమానాశ్రయం నుంచి హజ్ కి వెళ్లే ప్రతి ప్రయాణికునికి రూ. లక్ష ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందించడం జరుగుతున్నదని పేర్కొన్నారు. హజ్-2026 కు విజయవాడ కేంద్రం నుంచి బయలుదేరి, విజయవంతంగా యాత్ర పూర్తి చేసి వచ్చిన 331 మంది హాజీలకు రూ. 3.31కోట్లు ప్రభుత్వం నేరుగా వారి అకౌంట్లకు రూ. లక్ష చొప్పున జమ చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు.కాగా పవిత్ర మక్కా హజ్ యాత్ర లో కుదిరించబడిన రోజులతో "షార్ట్" హజ్ యాత్ర సౌకర్యాన్ని కేంద్ర హజ్ కమిటీ కల్పించిందని,తక్కువ రోజుల వ్యవధి తో హజ్ యాత్ర పూర్తి చేయాలనుకునే వారు ఆ ఆప్షన్ ఎంచుకోవడం ద్వారా అవకాశాన్ని పొందవచ్చని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం 35-45 రోజుల వ్యవధితో చేసే హజ్ యాత్ర ప్యాకేజ్, 20 రోజులకు కుదిరించబడిన షార్ట్ హజ్ యాత్ర ప్యాకేజీ ధరల్లో ఎలాంటి వ్యత్యాసముండదని మంత్రి ఫరూక్ స్పష్టత ఇచ్చారు. 2027 - హజ్ యాత్రలో దేశ వ్యాప్తంగా హజ్ కు వెళ్లే వారిలో గరిష్టంగా 10000 మందికి షార్ట్ హజ్ సౌకర్యం కల్పించేందుకు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా నిర్ణయం తీసుకుందన్నారు.20 రోజుల వ్యవధితో షార్ట్ హజ్ కోరుకునే వారు తమ హజ్ దరఖాస్తును ఆన్ లైన్ లో సమర్పించేటప్పుడు, అందులో ఇచ్చిన షార్ట్ హజ్ ప్యాకేజీ ఆప్షన్ ను ఎంచుకోవాల్సి ఉంటుందన్నారు. పెరిగిన నాలుగు రోజుల గడువును సద్వినియోగం చేసుకోవాలని, విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రంను ఎంచుకొని గన్నవరం విమానాశ్రయం ద్వారా హజ్ యాత్ర కు వెళ్లే రాష్ట్రంలోని ప్రయాణికులందరికీ కూటమి ప్రభుత్వం అందించే రూ. లక్ష ఆర్థిక సహాయం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ విజ్ఞప్తి చేశారు.



# సమ్మె బాట పట్టిన దస్తావేజు లేఖర్లు

### జూలై 20 నుంచి 31 వరకు 'పెన్ డౌన్' సమ్మె,

### జీవో 396 రద్దుకై పోరాటం

**మాడుగుల, జూలై 20, జయ జయహే**

రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 396 దస్తావేజు లేఖరుల (డాక్యుమెంట్ రైటర్స్) జీవితాలను రోడ్డున పడేసేలా ఉందంటూ మాడుగుల మండల పరిధిలోని దస్తావేజు లేఖరులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదాస్పద జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, ఈ నెల 20 నుండి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టబోయే 'పెన్ డౌన్' (విధుల బహిష్కరణ) కార్యక్రమానికి మాడుగుల లేఖరుల సంఘం సంపూర్ణ మద్దతు ప్రకటించింది.ఈ మేరకు మండల కేంద్రంలో దస్తావేజు లేఖరులు అత్యవసరంగా సమావేశమై, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, దశాబ్దాలుగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో నమ్ముకుని జీవిస్తున్న వేలాది మంది లేఖరుల జీవనోపాధిని ఈ సరికొత్త జీవో పూర్తిగా దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.లప్రభుత్వ నిర్ణయం వల్ల కేవలం తమ ఉపాధి మాత్రమే కాకుండా, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే సామాన్య ప్రజలు, కక్షిదారులు సైతం తీవ్రమైన సాంకేతిక, పరిపాలనాపరమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి బలంగా తీసుకెళ్లి, తమ న్యాయమైన హక్కులను కాపాడుకునేందుకే ఈ 12 రోజుల పాటు పెన్ డౌన్ సమ్మెకు పిలుపునిచ్చినట్లు స్పష్టం చేశారు.మండలంలో ఈ నిరసన కార్యక్రమాన్ని సంపూర్ణంగా విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని తీర్మానించారు. అలాగే, ఈ న్యాయపోరాటం కేవలం లేఖరుల కోసమే కాకుండా ప్రజల సౌకర్యార్థం కూడా చేస్తున్నందున, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే కక్షిదారులు, ప్రజలు పరిస్థితిని అర్థం చేసుకుని తమకు పూర్తి స్థాయిలో సహకరించి అండగా నిలవాలని మాడుగుల దస్తావేజు లేఖరుల సంఘం వినమ్రంగా అభ్యర్థించింది.మండల పరిధిలోని లేఖరులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్న ఈ సమావేశం, ప్రభుత్వం తమ డిమాండ్లను ఆలకించే వరకు పోరాటం ఆపేది లేదనే స్పష్టం చేశారు.



# టెక్కలి దస్తావేజు లేఖర్ల నిరసనలు

### ప్రభుత్వ జీవో 396 కు వ్యతిరేకంగా ధర్నాలు

**టెక్కలి జూలై 20 జయ జయహే**

ప్రభుత్వ రిజిస్ట్రేషన్ శాఖను ప్రైవేటీకరణ దిశగా జీవో 396 కు వ్యతిరేకంగా రాష్ట్ర దస్తావేజు లేఖర్ల యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు టెక్కలిలో సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద స్థానిక దస్తావేజు లేఖర్ల ప్రతినిధులు నల్ల బ్యాడ్జీలతో నిరసనలు వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వ సమాలోచనలు విరమించుకోవాలని 396 జీవో రిజిస్ట్రేషన్ శాఖ ప్రైవేటీకరణ తో తమకు తీరని అన్యాయం జరుగుతోందని, తమ రాష్ట్ర యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా పెన్డౌన్ కార్యక్రమాన్ని చేపట్టి నిరసనలు తెలియజేస్తున్నట్లు దస్తావేజు లేఖర్ల యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

# షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్న రోలుగుంట విద్యార్థులు

**రోలుగుంట, జూలై 20:, జయ జయహే**

రోలుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఎం. శ్రీవాణి, వి. సిద్ధార్థ ప్రతిష్టాత్మక షైనింగ్ స్టార్స్ అవార్డ్స్--2026 లను అందుకున్నారు.పదో తరగతి వార్షిక పరీక్షల్లో 560 మార్కులు సాధించిన ఎం. శ్రీవాణి జనరల్ కేటగిరీలో, 514 మార్కులు సాధించిన వి. సిద్ధార్థ మైనార్టీ కేటగిరీలో షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఎంపికయ్యారు.అనకాపల్లిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా ఈ ఇద్దరు విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డు, ప్రశంసాపత్రం, పతకం (మెడల్)తో పాటు రూ.20,000 నగదు బహుమతిని అందుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థుల అసాధారణ ప్రతిభను అభినందించిన జిల్లా అధికారులు, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ఈ విశిష్ట విజయంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ అవార్డులు జెడ్పీహెచ్ఎస్ రోలుగుంట విద్యా ప్రమాణాలకు నిదర్శనమని పేర్కొంటూ, ఈ విజయం పాఠశాలకు మరింత గౌరవాన్ని తీసుకువచ్చిందని తెలిపారు.





# సమస్యలు పరిష్కారం కోరుతూ విద్యుత్ ఉద్యోగులు ఎమ్మెల్యేకి వినతి

**చోడవరం జూలై 25 జయ జయహే**

ఏపీ విద్యుత్ సంస్థలతో పని చేస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం విద్యుత్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజుని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగుల, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను సానుకూలంగా విన్న ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ..ఏ.పీ.లో పే రివిజన్ కమిటీ (పి.ఆర్. సి) వెంటనే వేయాలనీ, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల అందర్నీ సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలనీ, కొత్తవారికి పాతవారితో సమానంగా వేతనాల్లో వ్యత్యాసాన్ని సవరించి ఇవ్వాలనీ కోరారు. అలాగే సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ, పి ఆర్ సి లోనాన్ రెగ్యులర్ ఉద్యోగులకు కనీస వేతనం.48,000 లు ఇవ్వాలనీ,పెండింగ్ లో ఉన్న డి ఏ లను వెంటనే డిలీట్ చేయాలనీ కోరారు. అరియర్స్ ను ఒకే విడతలో చెల్లించాలనీ, జేఎల్ఎం గ్రేట్ 2 ఎనర్జీ అసిస్టెంట్లు నుండి జే. ఎల్ . ఎం. లుగా కన్వర్షన్ అయినా ఉద్యోగులకు మూడు డిస్కకం లో ఒకే పద్ధతి నీ పాటించి వెంటనే అసిస్టెంట్ లైన్మెన్లు గా పదోన్నతులు కల్పించాలనీ తదితర పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజియన్ అధ్యక్షులుప్రేమ చంద్రశేఖర్ , రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేపాడ సత్యనారాయణ, సంఘ ప్రతినిధులుజి.ఏ. సత్యనారాయణ, పూరి సత్యనారాయణ, బ్రహ్మాజీ, నాగరాజు, రవి, శంకర్, బి.ఎల్.ఎం .నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# ఆవోపా పగ్గాలు రవికుమార్‌కు

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై 20**

ఆర్యవైశ్య ఆఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడలో ఘనంగా ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం మరియు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారమహోత్సవం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు ప్రగళ్ళపాటి కనకరాజు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో, నీట్ మరియు ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 50 మంది ఆర్యవైశ్య విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, మరియు జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బూరగడ్డ మురళి సిఫార్సు మేరకు, 2026-28 సంవత్సరానికి గాను రాజమహేంద్రవరం ఆవోపా నూతన అధ్యక్షులుగా జర్నలిస్ట్ రవికుమార్అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు ప్రధాన కార్యదర్శిగా శివ్వా రామచంద్రరావు, కోశాధికారిగా అరవపల్లి వెంకట రమణ వేదికపై ప్రమాణ స్వీకారం చేశారు.నూతన అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జర్నలిస్ట్ రవికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సమాజ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య యువతను ఉన్నత స్థానాల్లో నిలపడానికి, నిరుద్యోగ యువతకు మరియు విద్యార్థులకు ఆవోపా తరపున పూర్తి స్థాయి మార్గదర్శకత్వం, సహాయసహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. సంఘం ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ఆవోపా ఫౌండర్ 'శక్తి వక్కపొడి' అధినేత పువ్వాడి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ వేడుకలో కాకినాడకు చెందిన పలువురు వైశ్య ప్రముఖులు, సంఘ నాయకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# ఎదురెళ్లి అర్జీ స్వీకరించిన జెడ్సీ రాము

### మ్యుటేషన్ చేయాలని కోరిన దివ్యాంగురాలు

**విశాఖపట్నం, జూలై 20, జయ జయహే**




జీవీఎంసీ నార్త్ జోన్ సోమవారం నిర్వహించిన పీజీఆరఎస్‌లో 9 మంది ఫిర్యాదులు అందజేశారు. జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము అర్జీలు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ 2, ఇంజనీరింగ్ ఒకటి, రెవెన్యూ రెండు, య-సీడీ 4 కలిపి మొత్తం 9 అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. అయితే ఆస్తి బదలాయింపు కోరుతూ పీజీఆరఎస్‌కు వచ్చిన దివ్యాంగురాలు వేగి రమణమ్మ కోసం జోనల్ కమిషనర్ ఎదురెళ్లి మరీ అర్జీ స్వీకరించారు. ఆమె మామ నుంచి వీలునామా రిజిస్ట్రీ కాబడిన ఆ ఆస్తిని ఆమె పేరిట మ్యుటేషన్ చేయాలని సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. అర్జీలన్నింటినీ ఎప్పటికప్పుడు క్లియర్ చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని అంతే గానీ అర్జీలను అలా వదిలేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# ప్రధాని పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనితలి

**విజయనగరం, జులై 20 (జయ జయహే )**

ఆగస్టు 1న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడి పర్యటనకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్ఛార్జి మంత్రి, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అధికార యత్రాంగాన్ని ఆదేశించారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై సాధికారతా సంబంధాల శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి, ఆమె సోమవారం ఎయిర్‌పోర్టును సందర్శించారు. ప్రధాని పర్యటనా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి, ఎస్పి ఎఆర్ దామోదర్, ఇతర అధికారులతో ఎయిర్‌పోర్టు సమావేశ మందిరంలో సమీక్షించారు. పర్యటనకు చేస్తున్న ఏర్పాట్లపై అంశాలవారీగా మంత్రి చర్చించారు. రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి భారీ ఎత్తున జనం, విఐపిలు, వివిఐపిలు తరలివస్తారని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.



ఏర్పాట్లలో చిన్నపాటి లోపాలు కూడా ఉండకూడదని మంత్రులు స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు ఎక్కడా ఇబ్బంది రాకుండా పక్కా ప్రణాళికతో వ్యవహరించాలని మంత్రులు సూచించారు. గిరిజన సంప్రదాయ కళల ప్రదర్శన, అరకు నుంచి విద్యార్థులను తీసుకువచ్చే అంశంపై చర్చించారు. ఉత్తరాంధ్ర ముఖ చిత్రాన్ని మార్చే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా నిర్వహించాలని, ప్రణాళికాబద్దంగా



ఏర్పాట్లు చేయాలని మంత్రులు కోరారు. ఈ పర్యటనలో నెల్లిమర్ల ఎంఎల్ఏ లోకం నాగమాధవి, మార్కెఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, జాయింట్ కలెక్టర్ ఎస్.సేధు మాధవన్, జిసిసి ఎండి ఎస్ ఎస్ శోభిక, ఐఏఎస్ అధికారి అభిషేక్, ట్రైనీ ఐఏఎస్ హరి ఓం పాండ్యా, జిల్లా అధికారులు, జిఎంఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహో



# ప్రజాకవి అందెశ్రీ

(సి.హెచ్.ప్రతాప్)

అందెశ్రీ తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిపోయిన ప్రజాకవి. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. సాధారణ పల్లె జీవితంలో పుట్టి, ప్రకృతిని గురువుగా చేసుకుని, ప్రజల కష్టాలు, ఆశలు, ఆకాంక్షలను తన గీతాల్లో జీవింపజేసిన మహాకవి ఆయన. చదువు, సౌకర్యాలు లేని నిరాడంబర జీవితం నుంచి ఎదిగి, తెలుగు సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. తెలంగాణ ఉ ద్యమానికి తన కలంతో ప్రాణం పోసిన కవిగా ఆయన పేరు చిరస్థాయిగా నిలుస్తుంది.

అందెశ్రీ కవిత్వం ప్రజల భాషలో, ప్రజల కోసం, ప్రజల హృదయాలను తాకేలా ఉంటుంది. ఆయన రచనల్లో పల్లె జీవనం, మట్టివాసన, ప్రకృతి సౌందర్యం, సామాజిక చైతన్యం, ఆత్మగౌరవం స్పష్టంగా కనిపిస్తాయి. ముఖ్యంగా "జయ జయహే తెలంగాణ" గీతం ఆయన సాహిత్య ప్రతిభకు, ఉ ద్యమ స్ఫూర్తికి ప్రతీకగా నిలిచింది. ఈ గీతం తెలంగాణ రాష్ట్ర గీతంగా గుర్తింపు పొందడం ఆయన కృషికి లభించిన గొప్ప గౌరవం.

తెలంగాణ సాధన ఉద్యమంలో అందెశ్రీ పాత్ర అమూల్యం. ఆయన పాటలు ఉద్యమకారుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ప్రజల్లో ఐక్యతను, ఆత్మవిశ్వాసాన్ని పెంచాయి. కేవలం ఉ ద్యమ గీతాలే కాదు, ఆయన సినిమా పాటలు కూడా జనంలో బాగా పాపులర్ అయ్యాయి. ప్రజల జీవితం, సామాజిక బాధ్యత, మానవతా విలువలు ఆయన రచనల్లో ప్రధానాంశాలుగా నిలిచాయి. ఆయన కవిత్వం వినడానికి మధురంగా, ఆలోచించడానికి లోతుగా, ఆచరించడానికి ప్రేరణగా ఉంటుంది.

అందెశ్రీకి పలు సాహిత్య పురస్కారాలు లభించాయి. దాశరథి సాహితీ పురస్కారం, రావూరి భరద్వాజ పురస్కారం, జానకమ్మ జాతీయ పురస్కారం వంటి గౌరవాలు ఆయన ప్రతిభకు సాక్ష్యాలు. తెలంగాణ ప్రభుత్వం కూడా ఆయనను విశిష్టంగా సత్కరించింది. ఇవన్నీ ఆయన ప్రజాకవిగా, ప్రజల మనిషిగా నిలిచిన గుర్తింపులు. సన్మానాల కంటే ప్రజల ప్రేమనే ఆయన ఎక్కువగా పొందారు.

అందెశ్రీ జీవితం ఒక ప్రేరణ. పేదరికం, అవకాశాల లేమి, చదువు అడ్డంకులు ఉన్నప్పటికీ, ప్రతిభ, తపన, ప్రజల పట్ల ప్రేమ ఉంటే గొప్ప సాహిత్యం సృష్టించవచ్చని ఆయన జీవితం చెబుతుంది. తెలంగాణ నేల గౌరవాన్ని, ప్రజల గళాన్ని, అస్తిత్వాన్ని అక్షరాలుగా మలిచిన అందెశ్రీ తెలుగు సాహిత్యంలో ఎప్పటికీ వెలుగొందుతారు.

# పెరుగుతున్న గుండెపోటు ముప్పుపై తస్మాత్ జాగ్రత్త

(సి.హెచ్.ప్రతాప్)

**భారత్‌లో గుండె-రక్తనాళ సంబంధిత వ్యాధులు అత్యంత పెద్ద ప్రజారోగ్య సవాలుగా మారుతున్నాయి. దేశంలో మరణాలకు ప్రధాన కారణాల్లో గుండెజబ్బులే మొదటి స్థానంలో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా గుండెపోటుతో సంభవించే మరణాల్లో దాదాపు 20 శాతం భారత్‌లోనే నమోదవుతున్నాయి. ప్రతి ఏడాది సుమారు 28 లక్షల మంది భారతీయులు గుండె సంబంధిత వ్యాధులతో ప్రాణాలు కోల్పోతుండగా, వీరిలో దాదాపు 60 శాతం మంది అకాల మరణాలకు గురవుతున్నారు. ఇది కేవలం వైద్య సమస్య మాత్రమే కాదు; దేశ ఉత్పాదకత, కుటుంబాల ఆర్థిక స్థితి, ప్రజారోగ్య వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్న సామాజిక-ఆర్థిక సమస్య కూడా.**



ఆందోళన కలిగించే మరో అంశం గుండెపోటు ఇప్పుడు వృద్ధులకే పరిమితం కాకపోవడం. భారతదేశంలో ప్రతి నలుగురిలో ఒకరికి 40 ఏళ్లలోపే గుండెపోటు వస్తుండగా, పురుషుల్లో సంభవించే గుండెపోటుల్లో సగానికి పైగా 50 ఏళ్లలోపే నమోదవుతున్నాయి. అంతేకాదు, చాలామందికి ముందస్తు లక్షణాలు కూడా కనిపించకపోవడం మరింత ప్రమాదకరం. గుండెపోటు, గుండె వైఫల్యం, పక్షవాతం వంటి సమస్యల్లో దాదాపు 99 శాతం కేసులకు నాలుగు నిశ్శబ్ద ప్రమాద కారకాలే ప్రధాన కారణమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అవి అధిక రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్, రక్తంలో చక్కెర స్థాయిలు పెరగడం (మధుమేహం లేదా ప్రీ-డయాబెటిస్), ధూమపానం.

ఈ నాలుగు సమస్యలు చాలామందిలో ఎలాంటి స్పష్టమైన లక్షణాలు లేకుండానే సంవత్సరాల పాటు శరీరాన్ని దెబ్బతీస్తుంటాయి. అధిక రక్తపోటు ధమనులను బలహీనపరుస్తుంది. కొలెస్ట్రాల్ రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోయేలా చేసి రక్తప్రసరణను అడ్డుకుంటుంది. మధుమేహం గుండె, రక్తనాళాల పనితీరును దెబ్బతీస్తుంది. ధూమపానం రక్తనాళాలను సంకోచింపజేసి గుండెపోటు ప్రమాదాన్ని అనేక రెట్లు పెంచుతుంది. దీనికి తోడు ఊబకాయం, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జన్యుపరమైన కారణాలు సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.

ఇటీవలి అధ్యయనాలు మరో ఆందోళనకర విషయాన్ని వెల్లడిస్తున్నాయి. భారతీయుల్లో కరోనరీ ఆర్టరీ వ్యాధితో బాధపడుతున్న వారిలో దాదాపు సగం మందిని సాధారణ ఆరోగ్య పరీక్షలు గుర్తించలేకపోతున్నాయి. అలాగే భవిష్యత్తులో గుండెపోటుకు గురయ్యే వారిలో 80 శాతం మంది సాధారణ ప్రమాద అంచనా విధానాల్లో కనిపించడం లేదు. ఫలితంగా గుండెపోటు వచ్చిన తర్వాతే సమస్య బయటపడుతోంది. మరింత విషాదకరమైన విషయం ఏమిటంటే, దేశంలో గుండెపోటుతో సంభవించే మరణాల్లో సగానికి పైగా ఇళ్లలోనే జరుగుతున్నాయి. గుండెపోటు వచ్చిన మొదటి గంటను 'గోల్డెన్ అవర్'గా పరిగణిస్తారు. ఈ సమయంలో వైద్యసేవలు అందకపోవడం వల్ల అనేక ప్రాణాలు కోల్పోతున్నారు.

గుండెపోటు వచ్చే ముందు ఛాతీలో నొప్పి లేదా ఒత్తిడి, ఎడమ చేయి, భుజం, మెడ లేదా దవడ వరకు వ్యాపించే నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అధిక చెమటలు, వికారం, తీవ్రమైన అలసట వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయరాదు. ముఖ్యంగా మహిళలు, మధుమేహ రోగుల్లో ఈ లక్షణాలు భిన్నంగా కనిపించే అవకాశం ఉంది.

వైద్య నిపుణులు 20-30 ఏళ్ల వయసు నుంచే గుండె ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచిస్తున్నారు. క్రమం తప్పకుండా రక్తపోటు, రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్ పరీక్షలతో పాటు అవసరమైతే ఈసీజీ, ఎకోకార్డియోగ్రామ్ వంటి పరీక్షలు చేయించుకోవాలి. రోజూ కనీసం 30 నిమిషాల వ్యాయామం, సమతుల ఆహారం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండటం, ఒత్తిడిని నియంత్రించడం, తగిన నిద్రపోవడం వంటి అలవాట్లు గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి.

గుండెపోటు ఒక్కరోజులో వచ్చే వ్యాధి కాదు; అది సంవత్సరాల నిర్లక్ష్యానికి చివరి హెచ్చరిక. ఆరోగ్య పరీక్షలు, జీవనశైలిలో మార్పులు, ప్రమాద కారకాల నియంత్రణ, సమయానికి వైద్యసేవలు---ఈ నాలుగు చర్యలే వేలాది ప్రాణాలను కాపాడగలవు. గుండెను కాపాడుకోవడం అంటే కేవలం ఒక అవయవాన్ని కాదు, ఒక కుటుంబం భవిష్యత్తునే రక్షించడం.

# నేటి సమాజానికి వేమన బోధనలే దిక్సూచి

(సి.హెచ్.ప్రతాప్)


**తెలుగు సాహిత్య చరిత్రలో యోగి వేమనకు విశిష్ట స్థానం ఉంది. ఆయన కేవలం కవి మాత్రమే కాదు; యోగి, తాత్వికుడు, సామాజిక సంస్కర్త. సరళమైన భాషలో లోతైన జీవన సత్యాలను ప్రజలకు చేరవేసిన మహనీయుడు. అందుకే ఆయన పద్యాలు శతాబ్దాలు గడిచినా ప్రజల నిత్యజీవితంలో సజీవంగా నిలిచాయి.**

వేమన జన్మకాలం, జన్మస్థలం గురించి భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ఆయన జీవితానికి కడప ప్రాంతంతో అనుబంధం ఉన్నట్లు భావిస్తారు. యౌవనంలో భోగజీవితం గడిపిన ఆయన, అనంతరం వైరాగ్యాన్ని స్వీకరించి గ్రామగ్రామాన సంచరిస్తూ నీతి, యోగం, ఆత్మజ్ఞానం, మానవతా విలువలను బోధించాడు.

వేమన పద్యాల గొప్పతనం వాటి సరళతలో ఉంది. క్లిష్టమైన తాత్విక భావాలను సైతం సామాన్యులు అర్థం చేసుకునే భాషలో ఆయన వ్యక్తీకరించాడు. లోభం, అహంకారం, కులవివక్ష, మూఢనమ్మకాలు, ఆడంబరాలపై ఆయన తీవ్రంగా విమర్శలు గుప్పించాడు. మనిషి గొప్పతనం బాహ్య ప్రదర్శనలో కాకుండా అంతరంగ శుద్ధిలోనే ఉందని ఆయన పదేపదే గుర్తుచేశాడు.

"ఆత్మశుద్ధి లేని ఆచారమది యేల?" అనే ప్రసిద్ధ పద్యం ద్వారా ఆచారాల కంటే చిత్తశుద్ధికే ప్రాధాన్యం ఇచ్చాడు. అలాగే "అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను..." అనే పద్యంలో వినయం, మితభాషణం, నిరాడంబర జీవనమే నిజమైన గొప్పతనమని బోధించాడు. సామాజిక మాధ్యమాల ప్రభావం, ప్రదర్శన ధోరణి, విలువల క్షీణత కనిపిస్తున్న నేటి కాలంలో ఈ సందేశాలు మరింత ప్రాసంగికంగా మారాయి.

వేమన మానవ సమానత్వానికి ప్రాధాన్యం ఇచ్చాడు. కులం, మతం, సంపద, పదవి వంటి భేదాల కంటే మానవత్వమే గొప్పదని ఆయన స్పష్టం చేశాడు. నిజాయితీ, కరుణ, సత్యనిష్ఠ, వివేకం వంటి విలువలతో కూడిన వ్యక్తిత్వమే సమాజ పురోగతికి పునాదని ఆయన బోధనలు తెలియజేస్తున్నాయి.



ఆంధ్రప్రదేశ్‌లో స్థాపించబడిన యోగి వేమన విశ్వవిద్యాలయం ఆయన సాహిత్య, ఆధ్యాత్మిక వారసత్వానికి నిదర్శనం. యోగి వేమన పద్యాలు తెలుగు సాహిత్యానికి అలంకారం మాత్రమే కాదు; విలువలతో కూడిన జీవనానికి శాశ్వత మార్గదర్శకాలు. వాటిని చదవడం అంటే జీవితాన్ని మరింత లోతుగా అర్థం చేసుకోవడమే.




## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్రన్ రాజీనామా చేయాలి

అనకాపల్లి జయ జయహే

లక్షల మంది విద్యార్థులు భవిష్యత్తుతో ఆటలాడుతున్న కేంద్ర ప్రభుత్వా విద్యా విధానం నశించాలని నీట్ పేపర్ లీకేజ్ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు యువతకు మద్దతుగా అనకాపల్లి బాట సెంటర్ వద్ద సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించడం జరిగింది. ఈ ఆందోళన కారుల ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి సుమారు 150 వరకు పరీక్ష పేపర్లు లీకేజీలు జరిగాయి అని ఈ లీకేజీల కారణంగా ఎందరో విద్యార్థుల భవిష్యత్తు అగమ్య గోచరంగా మారిందని వారి పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజ్ కారణమైన బిజెపి ప్రభుత్వం విధానం వల్ల 20 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని దేశమంతా ఆందోళన చేస్తున్న మోడీ ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకుండా ఉందన్నారు. ఈ ఆందోళన లో భాగంగా ప్రముఖ పర్యావరణ వేత్త సోనం వాంగ్ చుక్ 20 రోజులుగా నిరాహార దీక్ష చేస్తే ఆయన దీక్షను అక్రమంగా భగ్నం చేసి అరెస్టు చేశారని వారు పేర్కొన్నారు దేశంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా కనీసం పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేని చేతగాని బిజెపి ప్రభుత్వం దీనిని ప్రశ్నిస్తున్న యువతపై పోలీసులతో దాడులు చేయిస్తున్నారని వారన్నారు. ఎప్పటికైనా ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ చేస్తున్న ఆందోళనకు సంపూర్ణ మద్దతు ను ప్రకటించారు ఈ కార్యక్రలో సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, మండల కన్వీనర్ కాళ్ల తాతయ్య బాబు, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు యేసు రాజు, సురేష్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# కోటిలింగాలపేట ఇసుక ర్యాంపుపై తనిఖీలు

## గోదావరిలో 28 డ్రెడ్జింగ్ బోట్లు సీజ్?





**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాజమహేంద్రవరం కోటిలింగాలపేట కైలాస భూమి సమీపంలోని ఇసుక ర్యాంపులో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. అదే సమయంలో గోదావరి నదిలో అనుమతులు లేకుండా డ్రెడ్జింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించి 28 డ్రెడ్జింగ్ బోట్లను సీజ్ చేసినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. ఈ పరిణామాలు ఇసుక తవ్వకాల వ్యవహారంపై పలు ప్రశ్నలను తెరపైకి తీసుకొచ్చాయి. స్థానికుల సమాచారం ప్రకారం, కొంతకాలంగా గోదావరిలో రాత్రి వేళల్లో డ్రెడ్జింగ్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నదీ గర్భంలో తవ్వకాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుల నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు తనిఖీలు చేపట్టినట్లు తెలుస్తోంది. సీజ్ చేసిన బోట్ల యాజమాన్యం, వాటికి ఉన్న అనుమతులు, నిబంధనల ఉల్లంఘన వంటి అంశాలపై అధికారులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం. ఇదే సమయంలో, మరికొన్ని బోట్లపై చర్యలు తీసుకోకుండా తప్పించేందుకు కొందరు ప్రభావశీలులు మంతనాలు జరిపారనే ప్రచారం కూడా వినిపిస్తోంది. అయితే ఈ ఆరోపణలపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు. సంబంధిత అధికారులు కూడా దీనిపై స్పందించలేదు. గోదావరి నదిలో అక్రమ డ్రెడ్జింగ్ వల్ల నదీ ప్రవాహం, గట్లు, జలచర వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా రానున్న గోదావరి పుష్కరాల దృష్ట్యా అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు అవసరమని వారు సూచిస్తున్నారు. అయితే ఈ వ్యవహారంలో ఇంకా పలు ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది. సీజ్ చేసిన 28 బోట్లకు యజమానులు ఎవరు? ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించారు? తనిఖీల్లో ఏ శాఖలు పాల్గొన్నాయి? మరికొన్ని బోట్లను తప్పించేందుకు నిజంగానే ఒత్తిళ్లు వచ్చాయా? ఈ అంశాలపై సంబంధిత శాఖలు అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడిస్తేనే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుంది.

## జీవో నెంబర్ 396 మీద ప్రభుత్వం పునరాలోచన చేయాలి

**అనకాపల్లి జయ జయహే**

రిజిస్ట్రేషన్ స్టాంపులు శాఖ ద్వారా ప్రజలకు అందించే సేవలో ప్రైవేటు సంస్థలకు భాగస్వామి కల్పిస్తూ ప్రభుత్వం తీసుకుని వచ్చిన జీవో 396 పబ్లిక్ అండ్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ విధానం కె నిరసనగా దస్తావేజు లేఖరులు చేపట్టిన నిరాహార దీక్ష శిబిరం ఈరోజు అనకాపల్లి కొత్తూరు జంక్షన్ వద్ద ప్రారంభమైంది దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పది రోజులపాటు నిరసన దీక్ష శిబిరం కొనసాగుతుందని అనకాపల్లి దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు సంఘం ప్రతినిధులు అనకాపల్లి శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ ను కలిసి వినతి పత్రం సమర్పించారు రిజిస్ట్రేషన్ స్టాంప్ ల శాఖ జిల్లా అధికారి మన్మధరావు కి మరియు జాయింట్ సబ్ రిజిస్టర్ మాధవి కుమారి కి వారు వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు





## కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి: బొండా రాంబాబు

### నీట్ లో ప్రతిభ చాటిన తేజాస్ ను సత్కరించిన మార్నింగ్ కాఫీ క్లబ్

**భీమవరం ; (జయ జయహే)**

కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, రాబోయే రోజుల్లో పి జి లో కూడా మంచి మార్క్స్ సాధించాలని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పిఆర్ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు, చవ్వా శ్రీనివాససుబ్బారావు అన్నారు. నీట్ పరీక్షలో 540 అత్యుత్తమ మార్కులు సాధించిన పట్టణానికి చెందిన బొండాడ తేజాస్ ను సోమవారం మార్నింగ్ కాఫీ క్లబ్ అధ్వర్యంలో అభినందించి సత్కరించారు. బొండా హనుమంతరావు, కారుమూరి సత్యనారాయణ మూర్తి, మానేపల్లి రవి చిన్నారావు, భామ కృష్ణమూర్తి మాట్లాడుతూ జాతీయస్థాయిలో మెరుగైన మార్క్స్ సాధించడం మన జిల్లాకే గర్వకారణమని, కృషి, పట్టుదల ఉంటే అన్ని రంగాల్లోనూ రాణించగలుగుతారని అన్నారు. తటవర్తి బదరి,గుండు సుమూర్తి, కురిశెట్టి నాని మాట్లాడుతూ తేజాస్ ఇదే పట్టుదలను కొనసాగిస్తూ వైద్య విద్యలోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని, కష్టపడి చదివితే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చుని,ఈ విజయం మరెంతో మంది విద్యార్థులకు ఆదర్శంగా నిలవచ్చునని అన్నారు. అనంతరం తేజాస్ ను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో కంచర్ల భాస్కరరావు, మానేపల్లి వెంకన్నబాబు, కారుమూరి కిరణ్, సంకా బాబు, అనంతపల్లి సుబ్బారావు, కాఫీ క్లబ్ సభ్యులు మిత్రులు,కుటుంబ సభ్యులు వున్నారు

## ప్రజా వ్యతిరేక పాలనకు త్వరలోనే

# గుణపారం: మార్గాని భరత్





**రాజమహేంద్రవరం: జయ జయహే: జూలై 20**

స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పేకమేడలా కూలిపోతుందని, తడిగుడ్డతో గొంతులు కోయడం టిడిపి నైజమని మాజీ ఎంపి , వైసిపి జాతీయ అధికార ప్రతినిధి,రాజమహేంద్రవరం సిటీ ఇన్‌చార్జి మార్గాని భరత్ రామ్‌విమర్శించారు. సోమవారం వీఎల్‌పురంలోని వైసిపి సిటి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే గుణపారం చెబుతారని అన్నారు. టిడిపి నాయకుడి చేత మహిళను వివస్త్రను చేసిన ఘటనను తీవ్రంగా ఖండించిన భరత్, ఈ కేసులో జాతీయ మహిళా కమిషన్, మానవ హక్కుల కమిషన్, న్యాయస్థానం సుమోటోగా స్పందించి నిందితులకు కఠిన శిక్షలు విధించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వివేకానందరెడ్డి హత్య కేసులో రాజకీయ కోణం ఉ ందని, వైసిపి పై ఉద్దేశపూర్వకంగా బురదజల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. జగన్ నివాసంపై చేస్తున్న విమర్శలు అవాస్తవమని, అమరావతి అంతర్జాతీయ విమానాశ్రయ హామీ ఏమైందని ప్రశ్నిస్తూ, ల్యాండ్ పూలింగ్ భూముల్లోనే పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడిని కోరారు. ‘తల్లికి వందనం’ పథకం పేరిట సాయం ఇస్తున్నామని చెబుతూ, పాఠశాలల నిర్వహణ పేరుతో తల్లిదండ్రుల నుంచి వసూలు చేసిన నిధులు ఎక్కడికి వెళ్లాయో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. అనంతరం ‘జగన్ 2.0’ పోస్టర్తో పాటు జూలై 21న మోరంపూడి జంక్షన్‌లో చేపట్టనున్న ఆందోళన పోస్టర్లను ఆవిష్కరించారు. మోరంపూడి ఫ్లైఓవర్‌కు సర్వీస్ రోడ్లు వెంటనే నిర్మించాలని డిమాండ్ చేస్తూ రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్గాని నాగేశ్వరరావు, మార్తి లక్ష్మీ, పోలు విజయలక్ష్మి, సంకిశ భవానీప్రియతో పాటు పలువురు వైసిపి నాయకులు వైసిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## కమిషనర్ కృష్ణవేణికి ఘన సన్మానం

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ‘ఆపరేషన్ క్లీన్ స్వీప్’ కార్యక్రమంలో విశేష ప్రతిభ కనబరిచిన పురపాలక సంఘాలకు రాష్ట్రస్థాయి అవార్డులను ప్రదానం చేసింది. 20 వేల నుంచి 50 వేల లోపు జనాభా కలిగిన పురపాలక సంఘాల్లో ఉత్తమ పనితీరు కనబరిచిన మూడు పురపాలక సంఘాల్లో నిడదవోలు పురపాలక సంఘం ఎంపికైంది. ఈ సందర్భంగా సీఎం చేతుల మీదుగా నిడదవోలు పురపాలక సంఘం కమిషనర్ టి. కృష్ణవేణి రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. ఈ సందర్బంగా కమిషనర్ టి. కృష్ణవేణికి పురపాలక సంఘ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానిస్తూ అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిడదవోలు పురపాలక సంఘానికి గుర్తింపు తీసుకురావడంలో కమిషనర్ నాయకత్వం, అధికారులు, సిబ్బంది సమష్టి కృషి కీలక పాత్ర పోషించాయని కొనియాడారు. ఈ సందర్భంగా కమిషనర్ టి. కృష్ణవేణి మాట్లాడుతూ, ఈ అవార్డు తన ఒక్కరికే కాకుండా పురపాలక సంఘంలోని ప్రతి అధికారి, ఉద్యోగి, పారిశుద్ధ్య కార్మికుడి అంకితభావానికి లభించిన గుర్తింపని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.




## దుమ్ము మింగుతున్న మల్లయ్యపేట

### ఇసుక రోడ్డుతో ప్రజల ఆరోగ్యంపై ముప్పు --

### ప్రమాదాలకు అడ్డాగా మారిన రహదారి

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

నగరంలోని మల్లయ్యపేట ఇసుక రోడ్డు స్థానికులకు నిత్య నరకంగా మారింది. నెలలుగా రహదారి పూర్తిగా దెబ్బతిని దుమ్ము, దూళితో కప్పుకుపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లిన ప్రతిసారీ దుమ్ము మేఘాలు ఎగసిపడుతుండటంతో రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతుండగా, రోడ్డుకు ఆనుకుని నివసించే కుటుంబాలు దుమ్ము కారణంగా శ్వాస తీసుకోవడానికే ఇబ్బంది పడుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం, చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దగ్గు, అలర్జీలు, కళ్ల మంట వంటి సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయని వారు చెబుతున్నారు. ఇళ్లలో తలుపులు, కిటికీలు మూసుకున్నా దుమ్ము లోపలికి చేరి జీవనాన్ని దుర్భరంగా మారుస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకసార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కనీసం దుమ్ము నియంత్రణ కోసం నీరు చల్లే చర్యలు కూడా సక్రమంగా చేపట్టడం లేదని విమర్శిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే స్పందించి రహదారిని శాశ్వతంగా అభివృద్ధి చేయాలని, లేకపోతే పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.



## తి.తి.దే. ధార్మిక కార్యక్రమాలు ప్రారంభం

**జూపాడుబంగ్లా (జయ జయహే)**

తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధార్మిక వ్యాప్తిలో భాగంగా మంగళవారం నుండి శనివారం వరకు మండల కేంద్రమైన జూపాడు బంగ్లాలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం నుండి గురువారం వరకు మూడు రోజులు జి.వేంకటరమణయ్యచే సాయంత్రం 6-00 గంటల నుండి ధార్మిక ప్రవచనాలు, 7-00 గం. నుండి స్థానిక భజన మండలిచే భజన కార్యక్రమాలు, శుక్రవారం ఉదయం 10-00 గం.నుండి సామూహిక గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను స్థానిక భక్త సమాజంచే ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ నిర్వాహకులు ఇల్లూరి లక్ష్మీనారాయణ శ్రేష్ఠి, ఆలయ ధర్మకర్త మాకా వేంకట సుబ్బయ్య, ధర్మ ప్రచార మండలి సభ్యులు అంబటి శివశంకర రెడ్డి, అర్చకులు ఉమ్మయ్య, చిన్నతిరుపాలు, గోవిందప్పస్వామి, బాబు, రాము, రామయ్య, కృష్ణమూర్తి, నాగశేషులు, మల్లిఖార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అనకాపల్లిలో ప్రతిభ అవార్డుల ప్రధానోత్సవం





**అనకాపల్లి, జూలై 20, జయ జయహే :**

పాఠశాల విద్యాశాఖ అనకాపల్లి ఆధర్యంలో ఇంటర్, పదో తరగతి 2026 పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన షైనింగ్ స్టార్స్ విద్యార్థులకు అనకాపల్లి ప్రతిభ అవార్డుల ప్రధాన మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. స్థానిక రింగ్ రోడ్ లో గల పెంటకోట కన్వెన్షన్ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా నర్సీపట్నం ఎమ్మెల్యే శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ,ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తదితరులు హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల పై మరింత విశ్వాసం పెరిగేలా విద్యా ప్రమాణాలను మెరుగు పరుస్తున్నామని, ప్రతి ఏడాది 590 మార్కులకు పైగా సాధిస్తున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతుండడం ఇందుకు నిదర్శమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులు డాక్టర్లు, ఐఏఎస్, ఐపీఎస్, పాటు శాస్త్రవేత్తలు, సాయిధ దళాల్లో అధికారులు సాఫ్ట్వేర్ ఇంజనీర్లు వంటి ఉన్నత లక్ష్యాలను కూడా నిర్దేశించుకోవాలని ఆయన సూచించారు. దేశ రక్షణ లో శాయుధ దళాల పాత్ర ఎంతో గొప్పదని యువత ఆ రంగ పైన ఆసక్తి చూపాలని ఈ సందర్భంగా యువతకు ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తులో మంచి అవకాశాలను అందుపుచ్చుకోనేలా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచిస్తూ 188 ప్రతిభావంతుల విద్యార్థులకు అవార్డులు ప్రశంసా పత్రాలు నగదు బహుమతి 20 వేల రూపాయలు చెక్కులను అందజేసి విద్యార్థిని విద్యార్థులను సన్మానించి అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీష్, గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్ రాష్ట్ర డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# అనకాపల్లి సమగ్ర అభివృద్ధిపై జీవీఎంసీ అధికారులతో సమీక్ష

**(జయ జయహే)**

స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ జీవీఎంసీ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ తో ఇతర ఉన్నతాధికారులతో అనకాపల్లి నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు ఈ సమావేశంలో అనకాపల్లి పట్టణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించాలరు. ముఖ్యంగా అనకాపల్లి పరిధిలో కొప్పాక మరియు వాటర్ హెడ్ వాటర్ వర్క్స్ వద్ద సుమారు 5 కోట్లు నిధులతో సంపు కం పంప్ హౌస్ శంకుస్థాపన కార్యక్రమాల గురించి చర్చించడం జరిగింది . దీని ద్వారా అనకాపల్లి పట్టణానికి రోజు 500 గ్యాలన్ల సామర్థ్యంతో తాగునీటి సరఫరా జరుగుతున్నదని తెలియజేశారు. తాగునీటి రోడ్డు సమస్యల పరిష్కారం ప్రజా పనులకు ప్రాధాన్యత



రహదారుల అభివృద్ధి ఏపీఐఐసి జోనుకు నీటి సరఫరా మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను వారు సమీక్షించారు అలాగే ముఖ్యమైన ప్రతిపాదనలుగా డ్రైనేజీ వ్యవస్థ అరహదారులు తాగునీరు వీధి దీపాలు అంశాలపై సమగ్ర చర్చ రింగ్ రోడ్డు సైకిల్ ట్రాక్ అభివృద్ధి జిల్లా కేంద్రంగా అనకాపల్లి అభివృద్ధి నగర సుందరీకరణ పార్కుల అభివృద్ధి మరియు సుందరీకరణ అభివృద్ధి వైజాగ్ అనకాపల్లి రింగ్ రోడ్డు పార్కు అభివృద్ధి వివిధ ప్రాంతాల్లో బ్యూటీ కేషన్ ఫ్రూట్ మార్కెట్ అభివృద్ధి రెవెన్యూ జనరేషన్ పెంపు తక్కువ పెట్టుబడితో అధిక స్థాయిలో సుంద్రీకరణ పై చేపట్టే ప్రణాళికలపై అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఎస్సీ ఈ( ప్రాజెక్టు ఏడుకొండలు జీవీఎంసీ అనకాపల్లి జోన్ ఎస్ ఈ శ్రీనివాసరావు ఈ ఈ వాటర్ సప్లై శేఖర్ ఈ ఈ గోపాలకృష్ణ జోనల్ కమిషనర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు

# అనంతగిరి గిరిజన మోర్చా మండలాధ్యక్షుడిగా మాదేల కొండబాబు నియామకం

**అనంతగిరి.జూలై 20: జయ జయహే.**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ బలోపేతం కోసం అరకు, పాడేరు నియోజకవర్గాల పరిధిలోని 7 మండలాల్లో గిరిజన మోర్చా మండలాధ్యక్షులను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు లకే అబ్బాయిదొర తెలిపారు. ఇందులో భాగంగానే అరకు నియోజకవర్గ పరిధిలోని అనంతగిరి మండలానికి సంబంధించి, కివర్ల పంచాయతీ పూతిక పుట్టు గ్రామానికి చెందిన మాదేల కొండబాబుకు ఈ బాధ్యతలు అప్పగించారు. క్షేత్రస్థాయిలో బీజేపీ బలోపేతానికి, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా కొండబాబు పేర్కొన్నారు




# పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నప్పుడు జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశాలు నిర్వహించకూడదు

**అనకాపల్లి జయ జయహే**



అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రులు శాసనసభ్యులు పార్లమెంటు సభ్యులు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొనే అనకాపల్లి జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశాలు అందరికీ అందుబాటులో ఉండే సమయంలోనే నిర్వహించాలని తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర మాట్లాడుతూ అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ పాల్గొని ఈ సమీక్ష సమావేశం పార్లమెంటు సమావేశం మొదలయ్యే ఈరోజు అనగా సోమవారం జూలై 20వ తేదీన ఏర్పాటు చేసిన లేక కావాలని చేసినదో తెలియడం లేదని వారన్నారు పార్లమెంటు సమావేశం నిర్వహించే సమయంలో ఏర్పాటు చేయడం వలన అనకాపల్లి జిల్లా అభివృద్ధి పై గౌరవ సభ్యులు తమ యొక్క అభిప్రాయాలను వెలిబుచ్చే అవకాశం లేకుండా పోతుందని వారు పేర్కొన్నారు గతంలో కూడా ఏప్రిల్ నెలలో పార్లమెంటు సమావేశాలు ఆఖరి తేదీన సమావేశాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఒక జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం పార్లమెంటు సమావేశాలు శాసనసభ సమావేశాలు జరుగుతున్నప్పుడు పెట్టకూడదని ఒక నిబంధన ఉందని దాన్ని అధికారులు పట్టించుకోకుండా ప్రజా ప్రతినిధులు అందుబాటులో లేని సమయంలో ఏర్పాట్లు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు కాబట్టి ఈ యొక్క సమావేశాలు అందరూ అందుబాటులో ఉండే సమయంలో మార్చి పెట్టవలసిందిగా జిల్లా కలెక్టర్ వారిని మరియు అధికారులను ఆయన కోరారు

# ఊరందూరు, నారాయణపురంలో ఉపాధి హామీ పనులు కల్పించాలి

**శ్రీకాళహస్తిరూరల్, జులై 20,జయ జయహే.**

శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని ఊరందూరు, నారాయణపురం పంచాయతీల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు అంగేరి పుల్లయ్య డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద సామాజిక శంఖారావంలో భాగంగా దళితుల సమస్యలపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ ఊరందూరు, నారాయణపురం పంచాయతీలను శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో కలిపిన కారణంగా ప్రభుత్వం ఆ పంచాయతీ గ్రామాలతో పాటు జింగిలిపాలెం, పెంకులపాడు గ్రామాలకు గత ఐదేళ్లుగా ఉపాధి పనులు కల్పించడం లేదని వాపోయారు. తమను మున్సిపాలిటీలో కలపొద్దని కోర్టుకెళ్లి గ్రామస్తులు స్టే తెచ్చుకున్నా అధికారులు ఉపాధి పనులు కల్పించడంలో జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఫలితంగా సుమారు 250 వ్యవసాయ కూలీ కుటుంబాలు పనుల్లేక, మూడు పూటలా తిండి దొరక్క అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి పనులు కల్పించడంలో ఉన్న సాంకేతిక సమస్యను అధిగమించి




పేదలకు న్యాయం చేయాలని కోరారు. ఉడమలపాడు రెవెన్యూ, ఖాతా నెం.126లో వందమంది ఊరందూరు దళితులకు డీకేటి పట్టాలు ఇచ్చారనీ, అయితే గత ప్రభుత్వ హయాంలో సుమారు 20 ఎకరాల భూమిని కొందరు తమ పేర్లపై మార్చుకుని నీలగిరి చెట్లు పెంచుతున్నట్లు ఆరోపించారు. ఆర్డీవో విచారణ జరిపి దళితులకు న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా తొట్టంబేడు మండలంలోని చేమూరు దళితులకు 2006లో డీకేటి భూములు పంచిపెట్టారనీ, పట్టాలు కూడా ఇచ్చారనీ, అయితే ఆన్లైన్ చేయకుండా ఏళ్ల తరబడి తాత్సారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఇకనైనా దళితుల భూముల వివరాలను ఆన్లైన్లో ఎక్కించాలని కోరారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గంధం మణి, కేవిపిఎస్ నాయకులు పెనగడం గురవయ్య, వెలివేంద్రం, కుమార్, వెంకటేష్, ఊరందూరు, చేమూరు దళితులు పాల్గొన్నారు.



# ఆవోపా పగ్గాలు రవికుమార్‌కు

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై 20**

ఆర్యవైశ్య ఆఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడలో ఘనంగా ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం మరియు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారమహోత్సవం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు ప్రగళ్ళపాటి కనకరాజు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో, నీట్ మరియు ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 50 మంది ఆర్యవైశ్య విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలు, మరియు జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బూరగడ్డ మురళి సిఫార్సు మేరకు, 2026–28 సంవత్సరానికి గాను రాజమహేంద్రవరం ఆవోపా నూతన అధ్యక్షులుగా జర్నలిస్ట్ రవికుమార్అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో పాటు ప్రధాన కార్యదర్శిగా శివ్వా రామచంద్రరావు, కోశాధికారిగా అరవపల్లి వెంకట రమణ వేదికపై ప్రమాణ స్వీకారం చేశారు.నూతన అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జర్నలిస్ట్ రవికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా సమాజ సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య యువతను ఉన్నత స్థానాల్లో నిలపడానికి, నిరుద్యోగ యువతకు మరియు విద్యార్థులకు ఆవోపా తరపున పూర్తి స్థాయి మార్గదర్శకత్వం, సహాయసహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. సంఘం ద్వారా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమానికి ఆవోపా ఫౌండర్ 'శక్తి వక్కపాడి' అధినేత పువ్వాడి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ వేడుకలో కాకినాడకు చెందిన పలువురు వైశ్య ప్రముఖులు, సంఘ నాయకులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.



# రత్న కిశోర్ ఆకస్మిక మరణంపై జెడిఆర్ఎఫ్ సంతాపం

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై 20**

కుడెల్లి రత్న కిశోర్ అకాల మరణం పట్ల తూర్పుగోదావరి జిల్లా జెడిఆర్ఎఫ్ (జర్నలిస్ట్స్ డెమోక్రాటిక్ రైట్స్ ఫోరం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఆయన స్వగృహం వద్ద నిర్వహించిన సంతాప సభలో అర్పిసి అధినేత, జెడిఆర్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ.. అనతికాలంలోనే జర్నలిస్టుల సమస్యలపై ఎంతో చురుగ్గా స్పందిస్తూ, తూర్పుగోదావరి జిల్లా జెడిఆర్ఎఫ్ కార్యదర్శిగా రత్నకిషోర్ అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఎన్నికల నిర్వహణలో ఆయన ముందుండి నడిపిన పోరాటాన్ని గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడా శ్రీనివాస్‌తో పాటు జిల్లా జెడిఆర్ఎఫ్ నాయకులు మారంపూడి సోమరాజు, పిచ్చుక మహేష్ తదితరులు పాల్గొని రత్నకిషోర్‌కు నివాళులర్పించారు.



# జీవో నెంబర్3పై మాట్లాడే నైతిక హక్కు వైకాపాకు లేదు...

**మాజీ జీసీసీ చైర్మన్ ఎం.వి.వి. ప్రసాద్..**

**కొయ్యూరు : (జయ జయహే )న్యూస్ జులై 21,**

అల్లూరి జిల్లా, కొయ్యూరు మండలంలో జీవో నంబర్ 3 అంశంపై మాట్లాడే నైతిక హక్కు గత వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి గానీ, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు గానీ అస్సలు లేదని మాజీ జీసీ ఛైర్మన్ ఎం.వి.వి. ప్రసాద్ తీవ్రంగా విమర్శించారు.శనివారం కొయ్యూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గిరిజన ప్రయోజనాలను గత ప్రభుత్వ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ఇప్పుడు జీవో 3 గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు.గత వైకాపా ప్రభుత్వ హయాంలో నవశకం పోర్టల్ నుండి మొదట వాల్మీకి తెగను , ఆ తర్వాత భగత తెగను తొలగించారని గుర్తు చేశారు. గిరిజన హక్కులను కాలరాస్తున్నప్పుడు అప్పటి వైకాపా ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎక్కడ నిద్రపోయారా, దానికి గిరిజన ప్రజలకు సమాధానం చెప్పాలి అని మీడియా ముఖంగా డిమాండ్ చేశారు గిరిజనుల సంక్షేమాన్ని, హక్కులను నిర్లక్ష్యం చేసిన వైకాపా నాయకులకు గిరిజన ప్రాంతాల గురించి మాట్లాడే అర్హత లేదు అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దుచ్చరి చిట్టిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కాకూరు చంద్రరావు, లోత భీమరాజు, రాజేంద్రపాలెం సర్పంచ్ పిటా సింహాచలం, శ్యామల వరలక్ష్మి, సూరబోయిన చిన్నిబాబు, కురుజు శ్రీనుబాబు, కొయ్యూరు సర్పంచ్ మాకడా బాలరాజు, మాకడా బూరుగులయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# చలో పంచదారల నిరసన కార్యక్రమం జయప్రదం చేయండి

**అనకాపల్లి జయ జయహే**

ఈనెల 21న మంగళవారం చలో పంచదారల నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని వైఎస్ఆర్ పార్టీ పిలుపునిచ్చింది స్థానిక రింగ్ రోడ్ రైల్వే స్టేషన్ సమీప గల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైయస్సార్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ జిల్లాలో గల ఖనిజ సంపాదన దోచుకోవడమే ధ్యేయంగా పెట్టుకుని కూటమి ప్రభుత్వం పంచదారల పుణ్యక్షేత్రం పై నెలకొన్న దేవాలయాల సంపద అయిన ఐదు దారలు వచ్చే ప్రవహించే నీటి పంచదారలు మూసుకుపోయే పరిస్థితి ఏర్పడిందని కొండను ఇష్టానుసారం తవ్వకాలు ఈ ప్రభుత్వం చేసుకుంటూ పోతున్నదని ప్రభుత్వం ప్రజా ప్రతినిధులు ఆగడాలు ఎక్కడ నిలువరించలేకపోతున్నామని ఆయన పేర్కొన్నారు ఒక పక్క పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం అంటూ నీతి కబుర్లు చెబుతున్నాడని ఇక్కడ పుణ్యక్షేత్రా కొండని తవ్విపోతుంటే చూస్తూ ఉన్నావా అంటూ అని అయినా ఘాటుగా ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా చలో పంచదార కార్యక్రమం విజయవంతం చేయాలని పార్టీ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు ఆయన పిలుపునివ్వడం జరిగింది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీనిపై స్పందించాలని దీనిని నో జోన్ మైనింగ్ కింద ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.



50,000 హెక్టార్లకు అనుమతులు ఇస్తే నాలుగు లక్షల హెక్టార్ల తవ్వొక్కుపోతున్నారని సీఎం రమేష్ ఎలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్ కొండను గుండు గీసి పచ్చని చెట్లను ధ్వంసం చేస్తూ కొండను నాశనం చేస్తున్నారని ప్రకృతిని నాశనం, వినాశనం చేస్తున్నారని వారు తీవ్రంగా ధ్వజమెత్తారు సీఎం రమేష్ తాలూకా బంధువు విజయ్ కుమార్ కొండలను తవ్వుకునేందుకు టెండర్ వాడుకొని ఈ కొండలను ఖనిజ సంపదను దోచుకుంటున్నారని ఈ గ్రావెలను సీఎం రమేష్ కుమారుడు రితీష్ కుమార్ నడుపుతున్న కంపెనీకి సర్ఫరా చేస్తున్నారని కూటమి ప్రభుత్వం నాయకులు దోపిడీఏ ధ్యేయంగా చేసుకుని కోట్లు సంపాదిస్తున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన నిర్వహిస్తున్న ప్రభుత్వం ఎక్కడ పట్టించుకోవటం లేదని ప్రభుత్వ అధికారులు కూడా ఎక్కడ స్పందించడం లేదని వారు కూడా కూటమి నాయకులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని వారు ఆరోపించారు పంచదారల కొండపై పాండవులు సంచరించారని అటువంటి పంచదారల కొండ క్షేత్రాన్ని అపవిత్రం చేస్తూ నాశనం చేస్తున్నారని వారి ఆవేదన వ్యక్తం చేశారు ఒకపక్క కొండల్లో నుంచి ఎక్కడ పుట్టిందో నీరు ఐదు దారల కింద ప్రవహిస్తూ వస్తున్నదని అటువంటి నీటి దారల పాయలను కనుమరుగయ్యే పరిస్థితి చేస్తున్నారని ఇది చూసిన పర్యావరణ అధికారులు కూడా మొరపెట్టుకుంటున్న, అడ్డు చెప్పిన వీరు ఎవరికీ చలనం లేదని పట్టించుకోవడంలేదని ఆయన కూటమి ప్రభుత్వాన్ని స్థానిక నాయకులను తీవ్రంగా దుయ్యబట్టారు150 అడుగుల లోతున తవ్వుకుంటూ పోయారని చలో పంచదారల నిరసన కార్యక్రమానికి మాజీ శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వైయస్సార్ పార్టీ మాజీ మంత్రి కన్నబాబు మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు ఎమ్మెల్యేలు వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని అనకాపల్లి పార్టీ కార్యాలయం నుండి ఊరేగింపుగా పట్టణ మెయిన్ రోడ్డు నెహ్రూ చౌక్ మీదుగా పూడిమడక రోడ్డు నాగులపల్లి మీదుగా అచ్యుతాపురం మీదుగా పంచదారల కు ఈ ఊరేగింపు ఉంటుందని అక్కడ పెద్ద ఎత్తున ఆందోళన నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునివ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో దంతులూరు దిలీప్ కుమార్ మనసాల కిషోర్ గొర్రె సూరిబాబు జాజుల రమేష్ బొడ్డేడ శివ కెఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు



## మచ్చ యంత్ర చేధనం చేసిన అర్జునుడు

**శ్రీకాళహస్తి, జులై 20,జయ జయహే**

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారిదేవస్థానంఅనుబంధాలయమైన శ్రీ ద్రౌపతి సమేత ధర్మరాజు స్వామి వారి బ్రహ్మోత్సవాలు నాల్గవరోజుసోమవారం ఉదయం ఉత్సవము ఊరేగింపు నిర్వహించారు. అర్జునుడు మచ్చ యంత్ర చేధనం చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమం లో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కన్నుల పండువగా కళ్యాణ వెంకన్న పార్వేట ఉత్సవం

**చంద్రగిరి, జూలై 20, జయ జయహే.శ్రీనివాస**



మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి పార్వేట ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. శ్రీనివాస మంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు మార్గంలోని పార్వేట మండపం వద్ద సోమవారం అర్చకులు స్వామి వారి పార్వేట ఉత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 11 గంటలకు ఆలయం నుండి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పార్వేట మండపానికి తీసుకువచ్చారు. నైవేతలిగ నివేదన చేసి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా దుష్టశిక్షణ కోసం స్వామివారు మూడు సార్లు బళ్ళెను ప్రయోగించారు. తదుపరి స్వామివారికి ఆస్థానం సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను తిరిగి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాథ్, సూపరింటెండెంట్ రాజ్కుమార్, హరివిష్ణు, ఆలయ అధికారి ద్వారక మునికుమార్, ఆర్జితం అధికారి ధనశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు నారాయణాచార్యులు, బాలాజీ రంగకుమార్, అర్చక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రతిభా పురస్కారానికి ఎంపికైన ఎంజిఎం కాలేజ్ విద్యార్థి

**శ్రీకాళహస్తి, జులై 20,జయ జయహే**

తిరుపతిలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వం నిర్వహించిన షైనింగ్ స్టార్స్ ప్రోగ్రాం లో శ్రీకాళహస్తిలోని ఎంజీఎం కాలేజ్ విద్యార్థి గోవింద్ కిషోర్ మంచి మార్కులు సాధించినందుకు గాను ప్రభుత్వం నుండి 20 వేల రూపాయలు నగదు మరియు మెడల్ , సర్టిఫికెట్ బహుమతిని మంత్రి అనగానీ సత్య ప్రసాద్,తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా తిరుపతిలోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లో అందుకున్నారు.ఎంజీఎం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ గుడ్లూరు మయూర్ ఈ కార్యక్రమాన్ని వీక్షించి శ్రీకాళహస్తిలోని మా ఎంజిఎం కాలేజ్ నందు బాగా చదివి ఇంటర్మీడియట్ లో మంచి మార్కులు సాధించినందుకు ఈరోజు తిరుపతిలో జరిగిన ప్రతిభా పురస్కారానికి ఎంపికైన విద్యార్థి వారి తల్లి,తండ్రి, కాలేజీ ప్రిన్సిపల్ మధ్య ఈ ప్రతిభా పురష్కారాన్ని అందుకున్నందుకు సంతోషంగా ఉందని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగానీ సత్య ప్రసాద్ , తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎంజిఎం జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ వి ఎస్ రత్నం, విద్యార్థి తల్లిదండ్రిలు పాల్గొన్నారు.

## ఎం.ఏ.రాజుల కండిగ విద్యార్థినికి 'షైనింగ్ స్టార్స్ 2026' ప్రతిభా పురస్కారం

**ఎం.ఏ.రాజుల కండిగ,జూలై 20, జయ జయహే:**



కేవీబీ పురం మండలం ఎం.ఏ. రాజుల కండిగ ఎంపీపీ పాఠశాలకు చెందిన వర్రె బాలముని,అపర్ణ దంపతుల కుమార్తె వర్రె దీప్షిక పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో 600 మార్కులకు గాను 548 మార్కులు సాధించి ఘన విజయం సాధించింది.విద్యార్థిని కనబరిచిన ఈ ఉత్తమ ప్రతిభకు గాను తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా 'షైనింగ్ స్టార్స్ 2026' ప్రతిభా అవార్డును ప్రదానం చేశారు.గ్రామానికి గర్వకారణంగా నిలిచి,తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిన దీప్షికను,ఆమె తల్లిదండ్రులను పాఠశాల ఉపాధ్యాయులు,గ్రామ పెద్దలు మరియు స్థానికులు విశేషంగా అభినందించారు.

# ఉత్తరాంధ్ర గేట్‌వేగా భోగాపురం విమానాశ్రయం

**ఆగస్టు 1న ప్రారంభం నాటికి కనెక్టివిటీ రోడ్ల పూర్తికి చర్యలు**

**ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేసి పది రోజుల పాటు వేడుకలు నిర్వహిద్దాం: కలెక్టర్ అభిషిక్త్ కిషోర్**

**విశాఖపట్నం, జూలై 20, జయ జయహే**

ఆగస్టు 1న ప్రారంభం కానున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త దశ ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్ లో ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో విమానాశ్రయ ప్రారంభోత్సవం, రహదారి అనుసంధానం, ప్రజా రవాణా ఏర్పాట్లపై ఆయన వివరించారు. ఉత్తరాంధ్ర గేట్‌వేగా నిలవనున్న భోగాపురం విమానాశ్రయం ప్రారంభాన్ని పురస్కరించుకుని ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమష్టిగా పనిచేసి పది రోజుల పాటు ఉత్సవ వాతావరణంలో కార్యక్రమాలు నిర్వహిద్దామని కలెక్టర్ పిలుపునిచ్చారు. విమానాశ్రయం ద్వారా పర్యాటకం, పరిశ్రమలు, వాణిజ్యం, ఉపాధి అవకాశాలు మరింతగా పెరిగే అంశాలను ప్రజలకు వివరించేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు.




స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామం తదితర ప్రాంతాల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.విశాఖపట్నం నుంచి భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానంగా 28 ప్రధాన రహదారులు, సుమారు 238 కిలోమీటర్ల రోడ్లు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ఈ క్రమంలో తెలిపారు. ప్రతి రహదారిలో ప్రయాణికులకు స్పష్టమైన మార్గదర్శకాలు అందేలా విస్తృతంగా సైనేజీలు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్రౌన్‌ఫీల్డ్, గ్రీన్‌ఫీల్డ్ రహదారులను డిసెంబరు నాటికి అందుబాటులోకి తీసుకురావడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. మాస్టర్ ప్లాన్ రహదారులతో పాటు ఇప్పటికే ఉన్న రోడ్లను అనుసంధానం చేయాలని, మాస్టర్ ప్లాన్ రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఏడు ప్రాధాన్య రహదారుల్లో నాలుగు పూర్తయ్యాయని, అడవివరం - శొంఠ్యాం రహదారికి అటవీ అనుమతులు లభించాయని తెలిపారు. మిగిలిన రెండు రహదారుల పనులను కూడా వేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధంగా ఉందన్నారు. జుత్తాడ రహదారి పనులు కూడా ప్రారంభమవుతాయని చెప్పారు. మారికవలస జంక్షన్ విస్తరణ, వేపగుంట--జుత్తాడ రహదారి అభివృద్ధిపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు.

### కూడళ్ల విస్తరణ, ఫ్రీ లెఫ్ట్ ల వద్ద ప్రత్యేక చర్యలు

అనంతరం వివిధ కూడళ్లు, ఫ్రీ లెఫ్ట్, సిగ్నల్ పాయింట్స్ వద్ద తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ పలు అంశాలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రజలు కూడా ఫ్రీ లెఫ్ట్ విధానాన్ని అను-సరించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. వీటన్నింటిపై ఎమ్మెల్యేలు సూచనలు చేశారు. ప్రయాణికులు ఎయిర్పోర్ట్ కు సులభంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణ బాబు, విష్ణుకుమార్ రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, వీఎంఆర్డీఏ ఛైర్మన్ ప్రణవ్ గోపాల్, డీసీసీబీ ఛైర్మన్ కోన తాతారావు, జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ వి. సతీష్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



## మొలకెత్తిన విత్తనాల బంతులు చూస్తే ఆనందం వెల్లివిరిసింది

**విద్యార్థుల కృషి తో విత్తనాల బంతులు తయారీ**

**ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించుదాం**

**పి. శిరీష, ఎఫ్ ఆర్ ఒ, వి ఎం ఆర్ డి ఎ**

**విశాఖపట్నం (జయ జయహే)**

మొలకెత్తిన విత్తనాల బంతులు చూస్తే ఆనందం వెల్లివిరిసింది అని వి ఎం ఆర్ డి ఎ, ఎఫ్ ఆర్ ఒ, పి శిరీష పేర్కొన్నారు. సోమవారం ఎఎస్ రాజా మహిళా జూనియర్ కళాశాల లో మొలకెత్తిన విత్తనాల బంతులు గురించి గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ నిర్వహించిన అవగాహన కార్యక్రమం లో ఆమె మాట్లాడారు. విద్యార్థుల కృషి తో విత్తనాల బంతులు తయారవ్వడం ఆనందంగా ఉంది అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థీ ఒక వంద విత్తనాల బంతులు తయారు చేస్తే పర్యావరణానికి ఎంతో మేలు చేకూరుతుందని వివరించారు. 2000 సంవత్సరం నుంచి గ్రీన్ క్లైమేట్ టీం రత్నం తో కలిసి ఎఎస్ రాజా మహిళా జూనియర్ కళాశాల విత్తనాల బంతులు తయారు చేయడం అంటే అదొక గొప్ప విషయం అని వివరించారు. సామాజిక వనాలు పెంచి భూతాపం తగ్గించుదాం అని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ హితంగా జీవించుదాం అని కోరారు.గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం మాట్లాడుతూ విత్తనాల బంతులు తయారు చేయడం పది వేల సంవత్సరాల క్రితం అప్పటి మానవులు చేసిన కృషి అని వివరించారు. ఏనుగు లద్దె నుండి మొక్కలు రావడం చూసి ఆ విధానంతో విత్తనాల బంతులు తయారు చేయడం జరిగిందని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున విత్తనాల బంతులు తయారు చేయడం ద్వారా సామాజిక వనాలు పెంపొందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ జగదీష్, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ఊర్మిళ, బయాలజీ లెక్చరర్ లక్ష్మీ దుర్గ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ సమన్వయకర్త జె రాజేశ్వరి తదితరులు మాట్లాడారు.




## ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మద్దతు కోరిన తిరుపతి జిల్లా ఆర్టీసీ జేఏసీ

**తిరుపతి, జూలై 20, జయ జయహే**

ఆర్టీసీ పరిరక్షణ కొరకు రాష్ట్ర జేఏసీ చేపట్టిన దశలవారి పోరాటంలో రెండో దశ పోరాటంలో భాగంగా ప్రజా ప్రతినిధులను కలిసే క్రమంలో సోమవారం విద్యుత్ బస్సుల నిర్వహణ, మూసివేసిన డిపోల పునరుద్ధరణ పై యాజమాన్యం, ప్రభుత్వం నుండి స్పష్టత లేకపోవడంతో జేఏసీ నాయకులు నగరి నియోజకవర్గ శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ ని కలసి ఉద్యమానికి మద్దతు కోరారు. ఈ మేరకు ఆయనకు తిరుపతి జిల్లా ఆర్టీసీ జేఏసీ ఉద్యోగ సంఘాలు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ కన్వీనర్లు బిఎస్ బాబు, ఎన్ ఎం యూ ఏ జిల్లా కార్యదర్శి మస్తాన్, జిల్లా కార్యదర్శి,కో కన్వీనర్ శివకుమార్, ఎస్డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి జోనల్ నాయకులు ఆర్ముగం, జిల్లా ప్రచార కార్యదర్శి తాళ్ళమోహన్, జిల్లా కోశాధికారి మన్యం, పుత్తూరు డిపో జేఏసీ నాయకులు ఎన్ఎంయూఏ డిపో అధ్యక్షులు సుందరం డిపో కార్యదర్శి శివ,ఈయూ డిపో అధ్యక్షులు చలపతి కార్యదర్శి ప్రతాప్ కుమార్, అలిపిరి డిపో ఈయూ అధ్యక్షులు ఏబిఎస్ మన్యం మల్లికార్జున్లు పాల్గొన్నారు.



## నెలాఖరకు ప్రధాన రహదారులు సిద్ధం చేయాలి

**జాతీయ రహదారులు కలిసే చోట సూచికలు ఏర్పాటు చేయాలి**

**వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్**

**విశాఖపట్నం, జూలై 20, జయ జయహే :**

భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న తరుణంలో ప్రధాన రహదారుల పనులు వేగవంతం చేసి, నెలాఖరు నాటికి సిద్ధం చేసి అందుబాటులోకి తీసుకురావాలని వి ఎం ఆర్ డి ఎ ఛైర్మన్ ఎం వి ప్రణవ్ గోపాల్ ఆదేశించారు. సోమవారం ఉదయం అడవివరం- శొంఠ్యాం, వేపగుంట - పినగాడి రహదారుల అభివృద్ధి నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్‌తో కలిసి పరిశీలించారు. ప్రధాన రహదారుల నిర్మాణం దాదాపుగా పూర్తి కావొచ్చాయని, ఐతే విమాన ప్రయాణికులు ఈ రహదారుల్లో సులభతరంగా విమానాశ్రయానికి సకాలంలో చేరుకునేలా జాతీయ రహదారులను కలిసే ప్రాంతాల్లో సైన్ బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ప్రధాన రహదారుల మధ్య విభాగినిల పై నీడ నిచ్చే చెట్లను, పచ్చదనం పెంపొందించే పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారులు కలిసే కూడళ్లలో ప్రమాదాలు నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పినగాడి కూడలి వద్ద రహదారి విస్తరణ పనులు పరిశీలిస్తున్న సమయంలో స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు పాల్గొని, పలు సూచనలు చేశారు. రహదారి విస్తరణ, కాలువల నిర్మాణం గురించి చర్చించారు. అనంతరం పినగాడి రామాలయం వద్ద జరుగుతున్న కలువ , రహదారి విస్తరణ పై మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్ తేజ్ భరత్ స్థానికులతో చర్చించారు. రామాలయాన్ని తొలగించకుండా సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

For a pure tomorrow.. జయహే

# అనంతుడు పరబ్రహ్మ స్వరూపుడు ప్రవచనకర్త చాగంటి




**పద్మనాభం, జులై 20, జయ జయహే**

ప్రేమైక మూర్తి అనంత పద్మనాభస్వామి పరబ్రహ్మ స్వరూపుడని ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం పద్మనాభ స్వామి విశిష్టత - వైభవం గురించి ఆయన ప్రసంగించారు. అనంత యోగనిద్రలో ఉండే పద్మనాభస్వామి మూడు చుట్లు సత్వం, రజస్సు, తమస్సులను ప్రతిబింబిస్తాయని చెప్పారు. పంచ ఇంద్రియాలను ప్రసాదించే పరమశివుడిని మనస్సులో ధ్యానించని జన్మ వృథా అన్నారు. అనంత పద్మనాభస్వామి పరమ భక్తుడైన ట్రావెన్ కోర్ సంస్థానాధీశుడు మార్తాండ వర్మ తమ సర్వస్వం స్వామివారికి అర్పించి పద్మనాభదాసగా పేరు మార్చుకున్నారని వివరించారు. ఏడాది వయసులోనే బిడ్డలకు అభిషేకం జలాలతో ప్రోక్షణ చేసిన తర్వాత వారి పేరు చివర పద్మనాభదాసగా నామకరణం చేస్తారని పేర్కొన్నారు. కేరళలోని తిరువనంతపురంలో సాష్టాంగ నమస్కారం చేసే అవకాశం కేవలం ట్రావెన్ కోర్ సంస్థాన వారసులకే ఉంటుందన్నారు. చాగంటి కోటేశ్వరరావు దంపతులను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, శారద దంపతులు శాలువాతో సత్కరించారు. గంటా శ్రీనివాసరావు ఆహ్వానం మేరకు పద్మనాభం విచ్చేసిన చాగంటి కోటేశ్వరరావు ప్రవచన సభకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దఎత్తున జనం తరలి వచ్చారు. కార్యక్రమంలో ఆర్డీఓ సంగీత్ మాధుర్, దేవాదాయ శాఖ ఏసీ అన్నపూర్ణ, సత్యనారాయణ మూర్తి, చిక్కాల విజయ్ బాబు, గోపాలకృష్ణంరాజు, కసిరెడ్డి దామోదరరావు, కోరాడ రమణ, పంచకర్ల సందీప్, కురుమిన రామస్వామి నాయుడు, కాళ్ల సత్యనారాయణ, కురుమిన లీలావతి తదితరులు పాల్గొన్నారు.

# రత్న కిశోర్ ఆకస్మిక మరణంపై జెడిఆర్ఎఫ్ సంతాపం




**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై 20:**

కుడెల్లి రత్న కిశోర్ అకాల మరణం పట్ల తూర్పుగోదావరి జిల్లా జెడిఆర్ఎఫ్ (జర్నలిస్ట్స్ డెమోక్రాటిక్ రైట్స్ ఫోరం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఆయన స్వగృహం వద్ద నిర్వహించిన సంతాప సభలో అర్పిసి అధినేత, జెడిఆర్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేడా శ్రీనివాస్ మాట్లాడుతూ.. అనతికాలంలోనే జర్నలిస్టుల సమస్యలపై ఎంతో చురుగ్గా స్పందిస్తూ, తూర్పుగోదావరి జిల్లా జెడిఆర్ఎఫ్ కార్యదర్శిగా రత్నకిషోర్ అందించిన సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్ ఎన్నికల నిర్వహణలో ఆయన ముందుండి నడిపిన పోరాటాన్ని గుర్తుచేసుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడా శ్రీనివాస్‌తో పాటు జిల్లా జెడిఆర్ఎఫ్ నాయకులు మారంపూడి సోమరాజు, పిచ్చుక మహేష్ తదితరులు పాల్గొని రత్నకిషోర్‌కు నివాళులర్పించారు.

# హార్ట్ వర్క్‌తో స్మార్ట్ వర్క్ కూడా అలవరచుకోండి

### మీ విజయాల పరంపర కొనసాగించాలి

### సైనింగ్ స్టార్స్‌ను అభినందించిన కలెక్టర్ కిషోర్




**విశాఖపట్నం, జూలై 20, జయ జయహే :**


విద్యార్థుల జీవితంలో 'షైనింగ్ స్టార్స్' అవార్డు తొలి విజయమని, ఇక్కడితో ఆగిపోకుండా విజయాల పరంపరను కొనసాగించాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆకాంక్షించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ హార్డ్‌వర్క్‌తో పాటు స్మార్ట్‌వర్క్ కూడా అవసరమని, విద్యార్థులు ఇకపై స్మార్ట్‌వర్క్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వృత్తి ఏదైనా, రంగం ఏదైనా లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, లీప్ (లెర్నింగ్ ఎక్సెలెన్స్ ఇన్ ఏపీ) కార్యక్రమం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని 594 పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుతో పాటు విద్యా ఫలితాల సాధనను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి విద్యార్థి కనీసం ఒక క్రీడలో ప్రత్యేక శిక్షణ పొందాలని సూచించారు. తల్లిదండ్రులను గౌరవించి, వారి మార్గదర్శకత్వాన్ని జీవితంలో సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విశాఖ జిల్లాకు ప్రత్యేకమైన బ్రాండ్ ఉందని, విద్యార్థులకు పుష్కలమైన అవకాశాలు, వనరులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. విశాఖ విద్యార్థులు దేశవ్యాప్తంగా అందరికీ రోల్‌మోడల్‌గా నిలిచేలా ప్రత్యేకమైన గుర్తింపును సాధించాలని ఆకాంక్షించారు.

**134 మంది విద్యార్థులకు రూ.26.80 లక్షల కేటాయింపు...!**

మొత్తం రూ.26.80 లక్షలను ప్రభుత్వం కేటాయించింది. పదో తరగతి విద్యార్థులు 88 మందికి రూ.17.60 లక్షలు, ఇంటర్మీడియట్ విద్యార్థులు 46 మందికి రూ.9.20 లక్షలు అందజేశారు. గతంలో తాము లాంతరు వెలుగులో చదువుకునే పరిస్థితులు ఉండేవని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం విద్యార్థులకు అనేక వసతులు, అవకాశాలు కల్పిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా ఎదిగి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభను చూసి ఎంతో ఆనందంగా ఉందని, వారిని ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను అభినందించారు. మనతో పాటు జీవితాంతం ఉండేది చదువు ఒక్కటేనని, తల్లిదండ్రులు పిల్లల చదువు విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులతో తక్కువ మార్కులు వచ్చిన వారిని పోల్చి వారిని నిరుత్సాహపరచకూడదని, కృషి చేస్తే విజయం తప్పక సాధ్యమవుతుందన్నారు. పిల్లలను సెల్‌ఫోన్‌కు దూరంగా ఉంచాలని, తల్లిదండ్రులు కూడా సెల్‌ఫోన్ మోజుకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్ది దేశానికి సేవ చేసేలా తయారు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందన్నారు. భవిష్యత్తులో విద్యా రంగంలో ఆంధ్రప్రదేశ్ దేశానికే తలమానికంగా నిలిచే రోజులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గౌరవించడం ఎంతో సంతోషదాయకమన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సాధిస్తున్న అత్యుత్తమ ఫలితాలు గర్వకారణమన్నారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం సంతోషకర పరిణామమని పేర్కొన్నారు. విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న అత్యుత్తమ విధానాలను కేంద్ర ప్రభుత్వం సైతం ప్రశంసించిందని తెలిపారు. లీప్ వంటి వినూత్న కార్యక్రమాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సానుకూల మార్పులకు దోహదపడుతున్నాయని, దేశంలోనే ఆదర్శంగా నిలిచేలా రాష్ట్ర విద్యా విధానాలు ఉండటం గర్వకారణమని పేర్కొన్నారు.

# కన్నుల పండువగా కళ్యాణ వెంకన్న పార్వేట ఉత్సవం

**చంద్రగిరి, జూలై 20, జయ జయహే**



,శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి వారి పార్వేట ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. శ్రీనివాస మంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు మార్గంలోని పార్వేట మండపం వద్ద సోమవారం అర్చకులు స్వామి వారి పార్వేట ఉత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం 11 గంటలకు ఆలయం నుండి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా పార్వేట మండపానికి తీసుకువచ్చారు. నైవేతలిగ నివేదన చేసి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా దుష్టశిక్షణ కోసం స్వామివారు మూడు సార్లు బళ్ళెను ప్రయోగించారు. తదుపరి స్వామివారికి ఆస్థానం సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ, అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను తిరిగి ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాథ్, సూపరింటెండెంట్ రాజ్కుమార్, హరివిష్ణు, ఆలయ అధికారి ద్వారక మునికుమార్, ఆర్జితం అధికారి ధనశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు నారాయణాచార్యులు, బాలాజీ రంగకుమార్, అర్చక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

# టీటీడీకి రూ.కోటి విరాళం అందించిన తిరుమల కుమార్.

**తిరుమల, జూలై 20,జయ జయహే**



విజయవాడకు చెందిన అన్ బ్లిక్స్ క్లౌడ్ డేటా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సీఈవో తిరుమల కుమార్ కనకమేడల సోమవారం టీటీడీ శ్రీ వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.కోటి విరాళంగా అందించారు. ఈ మేరకు దాత శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథంకు విరాళం డీడీలను అందజేశారు. విరాళ దాతకు ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థ ప్రశాదలను అందజేశారు.



# రాజకీయాలకు అతీతం... ముద్రగడకు మహానివాళి

**రాజమహేంద్రవరం: జయ జయహే : జూలై 20**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ రాజమండ్రిలోని మంజీరా సరోవర్‌లో రాజమండ్రి నగర కాపునాడు ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ, టీడీపీ, బీజేపీతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు, కాపు సంఘాల ప్రతినిధులు, వేలాది మంది అభిమానులు పాల్గొని ఆయనకు ఘన నివాళులర్పించారు. సభలో పలువురు నేతలు ముద్రగడతో తమ అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, కాపు ఉద్యమానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. టిడిపి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ, కాపు సమాజం కోసం జీవితాంతం పోరాడిన యోధుడు ముద్రగడ అని అన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు, కాపు కార్పొరేషన్ ఏర్పాటు వంటి నిర్ణయాలకు ముద్రగడ పోరాటమే ప్రధాన కారణమని పేర్కొన్నారు.



## పాలకూర రసం తాగితే

# అందం, ఆరోగ్యం రెండూ మీ సొంతం

ఆకు కూరల్లో పాలకూర కూడా ఒకటి. పాలకూర ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో శరీరానికి కావాల్సిన ఎన్నో రకాల పోషకాలు లభిస్తాయి. ఎక్కువగా విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. పాలకూర మాత్రమే కాకుండా వీటి రసం తాగడం వల్ల కూడా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పాలకూర రసం తాగడం వల్ల ముఖ్యంగా కళ్ల ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఇందులో ఉండే విటమిన్ ఏ, గ్లాకోమా కంటి సమస్యలను నివారించి.. కంటి చూపును మెరుగు పరుస్తాయి. దృష్టి లోపాలు లేకుండా చేస్తాయి. రక్త హీనత సమస్యను నివారించడానికి కూడా సహాయ పడుతుంది. పాలకూర రసం తాగితే శరీరంలో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. సీజనల్ వ్యాధులతో పోరాడే శక్తిని అందిస్తుంది. వైరస్, బ్యాక్టీరియాలు ఎటాక్ చేయకుండా చూస్తుంది. అంతే కాకుండా గుండె సంబంధిత వ్యాధులు ఎటాక్ చేయకుండా.. గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుంది.

పాలకూర రసం తాగడం వల్ల చర్మ, జుట్టు ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది. వృద్ధాప్య ఛాయలు త్వరగా ఎటాక్ చేయకుండా.. ముడతలు రాకుండా ముఖాన్ని కాంతివంతంగా చేస్తుంది. అలాగే జుట్టు రాలకుండా, బలంగా, దృఢంగా ఉండేలా చేస్తుంది.

పాలకూరలో పవర్ ఫుల్ యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించడానికి ఎంతో హెల్ప్ చేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పాలకూర రసం తాగడం వల్ల బరువు కూడా అదుపులో ఉంటుంది.



# కాళ్లూ చేతులూ మెరిసేలా..

శరీర సౌందర్యంలో ముఖంతోపాటు కాళ్లూ, చేతులదీ కీలకపాత్రే. అమ్మాయి అందానికి అదనపు ఆకర్షణగా నిలిచే వీటిమీద చాలామంది సరైన శ్రద్ధ పెట్టరు. దానితోపాటు హార్మోన్ల ప్రభావం, చర్మ సమస్యలు, ఎండలో తిరగడంలాంటి వాటివల్ల ఈ ప్రాంతాల్లో మచ్చలు ఏర్పడుతుంటాయి. ఇవిపోయి మెరిసే చర్మం సొంతం కావాలంటే కొన్ని చిట్కాలు పాటిస్తే సరి!

**ఓట్స్- పెరుగు**

ఒక టీ స్పూన్ ఓట్స్‌ను మిక్సీలో వేసి పొడిగా చేసుకోవాలి. దానిలో పెరుగు కలపాలి. ఈ మిశ్రమాన్ని కాళ్లూ చేతులపై రాసి ఆరనివ్వాలి. తర్వాత చల్లటి నీళ్లతో శుభ్రంగా కడిగేయాలి. ఇలాచేస్తే చర్మంపై ఏర్పడిన మచ్చలు నెమ్మదిగా తగ్గుముఖం పడతాయి.

**టమాటా స్క్రబ్..**

ఒక టమాటా తీసుకుని మధ్యలో కోయాలి. దానిమీద చక్కెర చల్లి మచ్చలు ఉన్న ప్రదేశంలో స్క్రబ్ చేసుకోవాలి. లేదా టమాటాను మెత్తగా చేసి ఆ ప్రాంతంలో రాసినా ఫలితం ఉంటుంది. క్రమం తప్పకుండా దీన్ని ప్రయత్నిస్తే మచ్చలు మాయమవుతాయి.

**శనగపిండి**

రెండు స్పూన్ల శనగపిండిలో కొద్దిగా నీళ్లు కలిపి పేస్టులా చేయాలి. ఈ పిండిని కాళ్లు, చేతులకు రాసి కాసేపు వదిలేయాలి. ఆరిన తర్వాత కొద్దికొద్దిగా నీళ్లు చల్లుతూ స్క్రబ్ చేయాలి. వారానికి కనీసం మూడుసార్లు ఇలా చేస్తే సమస్య తగ్గుముఖం పడుతుంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com